# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 3-7-2022 RNI No.52865/93-Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :28 సంచిక: 269 పేజీలు:6 వెల: రూ.1/-


## కోనసీమ జిల్లాలో విషాదం.. తల్లీ, కూతురు సజీవదహనం

అమరావతి, జులై 2: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కోనసీమ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. జిల్లాలోని అల్లవరం మండలం కొమరగిరిపట్నంలో జరిగిన అగ్నిప్రమాదంలో తల్లి కూతురు సజీవదహనమయ్యారు. ఈరోజు తెల్లవారుజామున 4గంటల సమయంలో పూరి గుడిసె దగ్ధమైంది. తల్లి సాధనాల మంగాదేవి (40), కూతురు మెడిశెట్టి జ్యోతి (23) మృతి చెందారు. 5 నెలల క్రితం లవ్ మ్యారేజ్ చేసుకున్న జ్యోతి ప్రస్తుతం గర్భవతిగా ఉంది. అయితే ఈ అగ్నిప్రమాదం పై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దుండగుడు వీరిద్దరిని హత్య చేసి ఇల్లు తగలపెట్టారని అనుమానిస్తున్నారు. అనుమానితుడి పోలీసులు అరెస్టు చేసి విచారిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మోదీపై యుద్ధం రాష్ట్రపతి ఎన్నికలతోనే ఆగదు : యశ్వంత్ సిన్హా



హైదరాబాద్, జులై 2: కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వంపై విపక్షాల రాష్ట్రపతి అభ్యర్థి యశ్వంత్ సిన్హా మండిపడ్డారు. త్వరలో జరగబోయే రాష్ట్రపతి ఎన్నికల్లో ఓట్లు పడతాయి. అందులో సందేహం లేదు. కానీ, విషయం అదికాదు. ఈ యుద్ధం రాష్ట్రపతి ఎన్నికలతో ముగియదు. తరవాత కూడా కొనసాగుతుందని యశ్వంత్ సిన్హా తేల్చిచెప్పారు. తనకు తెలంగాణలో ఇంత ఘన స్వాగతం లభిస్తుందని ఊహించలేదు.. అందరికీ ధన్యవాదాలు. జై తెలంగాణ అని యశ్వంత్ సిన్హా అన్నారు.

హైదరాబాద్ జలవిహార్‌లో టీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన మద్దతు సభలో సిన్హా పాల్గొని ప్రసంగించారు. దేశంలో పీపుల్స్ మూమెంట్ మొదలైందన్నారు. టీఆర్ఎస్ తరపున కేటీఆర్ ఢిల్లీ రావడం తనకు మరింత బలం చేకూరిందన్నారు. రాష్ట్రపతి ఎన్నిక అనేది ఇద్దరు వ్యక్తుల మధ్య పోటీ కాదు– ఇద్దరి ఆలోచనలు, సిద్ధాంతాల మధ్య పోటీ అని పేర్కొన్నారు. దృఢమైన సంకల్పంతో వెళ్తే విజయం తథ్యమని తాను నమ్ముతానని యశ్వంత్ స్పష్టం చేశారు.

కేసీఆర్ విజన్ బాగుంది..

మోదీపై పోరాటం రాష్ట్రపతి ఎన్నికతోనే ఆగదు.. తరువాత కూడా కొనసాగుతుందన్నారు. సీఎం కేసీఆర్‌ను కలుపుకొని జాతీయ స్థాయిలో పోరాటం చేస్తామని తేల్చిచెప్పారు. కేసీఆర్ విజన్ బాగుంది.. దాన్ని జాతీయ స్థాయిలో తీసుకెళ్లాలని సూచించారు. తమ పోరాటం భారత భవిష్యత్ కోసమేనని పేర్కొన్నారు. దేశ ప్రజాస్వామ్యం, రాజ్యాంగ మూలాలను రక్షించడానికి తాము పోరాటం చేస్తున్నామని చెప్పారు. సీఎం కేసీఆర్ మాట్లాడిన ప్రతి పదం వాస్తవమేనని స్పష్టం చేశారు. కేసీఆర్ ఒక్కరే తెలంగాణ ఏర్పాటు కోసం పార్లమెంట్‌లో కొట్లాడారు. కేసీఆర్ తన స్వప్నం నెరవేర్చుకున్నారు.. కానీ అక్కడితో ఆగకుండా తెలంగాణను దేశంలో నెంబర్ గా నిలిపారని యశ్వంత్ సిన్హా ప్రశంసించారు.

## దేశానికి కేసీఆర్ లాంటి నేత అవసరం: యశ్వంత్ సిన్హా

హైదరాబాద్, జులై 2: దేశానికి కేసీఆర్ లాంటి నేత అవసరమని విపక్షాల రాష్ట్రపతి అభ్యర్థి యశ్వంత్ సిన్హా అన్నారు. సీఎం కేసీఆర్ అడిగిన ఏ ఒక్క ప్రశ్నకు మోదీ సమాధానం చెప్పలేదన్నారు. తెలంగాణ కావాలని ఒకేఒక్కడు కేసీఆర్ లోక్‌సభలో గళం విప్పారని చెప్పారు. ముఖ్యమంత్రితో మరోసారి సమావేశమవుతానని వెల్లడించారు. హైదరాబాద్ జలవిహార్‌లో రాష్ట్రపతి అభ్యర్థి యశ్వంత్ సిన్హాకు మద్దతుగా సీఎం కేసీఆర్ అధ్యక్షతన టీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యశ్వంత్ సిన్హా మాట్లాడుతూ.. టీఆర్ఎస్ పార్టీ తనకు సంపూర్ణ మద్దతిస్తున్నందుకుగాను సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

'మీ ఆదరాభిమానాలకు కృతజ్ఞతలు. దేశంలో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో కేసీఆర్ సవివరంగా చెప్పారు. తెలంగాణలో ప్రజా చైతన్యాన్ని ప్రత్యక్షంగా చూస్తున్నా. చాలా రోజులుగా కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నాం. దేశంలో పరిస్థితులు దిగజారుతుంటే చూస్తూ ఉండలేము. ఇది ఇద్దరు వ్యక్తుల మధ్య, ఇద్దరు వ్యక్తుల గుర్తింపు కోసం జరిగే పోరాటం కాదు. విశాల భారత పరిరక్షణ కోసం జరిగే పోరాటం.

విద్వేషపూరిత ప్రసంగాలు సమాజానికి మంచిదికాదు. ఒక వ్యక్తి చెబుతుంటే 135 కోట్లమంది వినాలా? ఇదేనా ప్రజాస్వామ్యం?. రాష్ట్రపతి ఎన్నికల తర్వాత కూడా ఈ పోరాటం కొనసాగుతుంది. ఇప్పుడు చేసే పోరాటం భారత్ భవిష్యత్ కోసం కాదు. మన పిల్లల బంగారు భవిష్యత్తు కోసం చేసే పోరాటమిది' అని యశ్వంత్ సిన్హా అన్నారు.

## గాంధీజీ కాంస్య విగ్రహాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్

సంగారెడ్డి, జులై 2 (నేటినిజం ప్రతినిధి): పటాన్ చెరు మండలం బీడీఎల్ పరిశ్రమలో ఏర్పాటు చేసిన పలు ప్రారంభోత్సవ కార్యక్రమాలకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనకు పరిశ్రమల యాజమాన్యం ఘన స్వాగతం పలికింది. ఈ సందర్భంగా బీడీఎల్ పరిశ్రమ మెయిన్ గేట్ లో ఏర్పాటు చేసిన గాంధీజీ కాంస్య విగ్రహాన్ని కేంద్ర మంత్రి రాజ్నాథ్ సింగ్ ప్రారంభించారు. అనంతరం బీడీఎల్ పరిశ్రమలో నూతన వారేడ్ భవనాన్ని ఆయన ప్రారంభించారు.



చరిత్రలో నేటినిజం



"బలివాడ" వంశమందున
పలుకథలు రచించినట్టి ప్రముఖ రచయితనూ
ఘులవేసి విడుసి గాలు తును
కలభావుకు పైనయట్టి "కాంతారావు"కు !!

( జులై 3 కథకుడు బలివాడ కాంతారావు జయంతి...) –రాధశ్రీ



సెల్: 9494481210

## రాష్ట్రపతి ఎన్నికల్లో ఆత్మప్రభోదానుసారం ఓటు వేయాలి: సీఎం కేసీఆర్

హైదరాబాద్, జులై 2:రాష్ట్రపతి ఎన్నికల్లో ఆత్మప్రభోదానుసారం ఓటు వేయాలని సీఎం కేసీఆర్ కోరారు. విపక్షాల రాష్ట్రపతి అభ్యర్థి యశ్వంత్ సిన్హాకు మద్దతుగా సీఎం కేసీఆర్ అధ్యక్షతన జలవిహార్‌లో శనివారం సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. యశ్వంత్ సిన్హాకు తెలంగాణ ప్రజలు, ప్రజాప్రతినిధుల తరపున హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నామన్నారు. యశ్వంత్ సిన్హా ఉన్నత వ్యక్తిత్వంగలవారని తెలిపారు. న్యాయవాదిగా కెరీర్‌ను ప్రారంభించారని, వివిధ హోదాల్లో దేశానికి అత్యుత్తమ సేవలందించారని పేర్కొన్నారు. ఆర్థిక మంత్రిగా పనిచేశారని, ఆయనకు అన్ని రంగాల్లో విశేష అనుభవముందని తెలిపారు. భారత రాజకీయాల్లో యశ్వంత్‌సిన్హాది కీలకపాత్ర అని పేర్కొన్నారు.

ఓటు వేసేటప్పుడు రాష్ట్రపతి అభ్యర్థులను బేరీజు వేసుకొని నిర్ణయం తీసుకోవాలని సీఎం కేసీఆర్ కోరారు. ఉత్తమ, ఉన్నతమైన వ్యక్తి రాష్ట్రపతిగా ఉంటే దేశ ప్రతిష్ట మరింత పెరుగుతుందని తెలిపారు. దేశంలో గుణాత్మక మార్పు తీసుకురావాల్సి ఉందన్నారు. ప్రధాని మోదీ ఇవాళ హైదరాబాద్ వస్తున్నారని, రెండు రోజులు ఇక్కడే ఉంటారన్నారు. ప్రతిపక్షాలపై ప్రధాని అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

తాము వేసిన ప్రశ్నలకు హైదరాబాద్ వేదికగా ప్రధాని మోదీ సమాధానాలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా కూడా నెరవేర్చలేదన్నారు. టార్చిలైట్ వేసి వెతికినా ఆయన నెరవేర్చిన హామీలు ఒక్కటీ కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. కేంద్ర సర్కారు డీజిల్ సహా అన్ని ధరలు పెంచేసిందని సీఎం కేసీఆర్ మండిపడ్డారు. ఇవి చాలదన్నట్లు నల్ల చట్టాలు తెచ్చి రైతులను ఇబ్బందిపెట్టారన్నారు. వ్యవసాయ చట్టాలపై రైతులు సుదీర్ఘ పోరాటం చేశారని, ఉద్యమంలో కొందరు రైతులు మృతిచెందారన్నారు. వారి కుటుంబాలకు తాము రూ. 3 లక్షలు ఇస్తే, బీజేపీ తమను చులకనగా చూసిందని సీఎం కేసీఆర్ మండిపడ్డారు.

ప్రధాని కాదు సేల్స్‌మెన్.. మోదీపై సీఎం కేసీఆర్ ఫైర్

మోదీ పాలనలో అంతా తిరోగమనమే అని సీఎం కేసీఆర్ విమర్శించారు. విపక్షాల రాష్ట్రపతి అభ్యర్థి యశ్వంత్ సిన్హాకు మద్దతుగా జలవిహార్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. మోదీ పాలనలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరని పేర్కొన్నారు. మోదీ..ప్రధానిగా కాకుండా దేశానికి సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నారని మండిపడ్డారు. మోదీ తీరుతో శ్రీలంకలో ప్రజలు నిరసనలు తెలిపారని గుర్తుచేశారు. శ్రీలంక చేసిన ఆరోపణలపై ప్రధాని మౌనమెందుకు వహిస్తున్నారని సీఎం కేసీఆర్ ప్రశ్నించారు. శ్రీలంక విషయంలో స్పందించకుంటే ప్రధాని మోదీని దోషిగానే చూడాల్సి వస్తుందన్నారు.

మోదీ ఎనిమిదేళ్ల పాలనలో ద్రవ్యోల్బణం పెరిగిపోయిందని, సామాన్యుడు బతుకలేని పరిస్థితి నెలకొందని సీఎం కేసీఆర్ ఆందోళన వ్యక్తంచేశారు. వికాసం పేరుతో దేశాన్ని నాశనం చేశారని మండిపడ్డారు. ప్రధాని మోదీ అవినీతిరహిత భారత్ అని పెద్దపెద్ద మాటలు చెప్పారని, ఎంత నల్లధనం వెనక్కి తీసుకొచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. మోదీపాలనలో అవినీతిపరులు పెరిగిపోయారన్నారు. నల్లధనం నియంత్రణ కాదు.. రెట్టింపైంది.. ఇదేనా వికాసం? అని ప్రశ్నించారు. మోదీ ప్రధానిగాకాదు..దోస్త్ కోసం షావుకార్‌గా పనిచేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ



వ్యవస్థలను ప్రధాని మోదీ దుర్వినియోగం చేశారని సీఎం కేసీఆర్ మండిపడ్డారు.

దేశంలో రైతులు, సైనికులు, నిరుద్యోగులు, ఉద్యోగులు ఇబ్బందిపడుతున్నారని సీఎం కేసీఆర్ తెలిపారు. మోదీ పనితీరుతో అంతర్జాతీయ స్థాయిలో దేశ ప్రతిష్ట దిగజారుతోందన్నారు. దేశంలో సరిపడా బొగ్గు నిల్వలు ఉన్నా..విదేశాలనుంచి బొగ్గు కొనాలని రాష్ట్రాలకు కేంద్రం హుకుం జారీచేస్తున్నదని ముఖ్యమంత్రి మండిపడ్డారు. మోదీపై జనంలో ఆగ్రహం పెరుగుతోందని తెలిపారు. మోదీ ఎన్నికలప్పుడు తియ్యటి మాటలు చెబుతారని ఎద్దేవా చేశారు.

రైతు చట్టాలు సరైనవే అయితే వాటిని వెనక్కు ఎందుకు తీసుకున్నారో చెప్పాలని సీఎం కేసీఆర్ డిమాండ్ చేశారు. మీరు దేశం ముందు తలదించుకున్నారని ప్రధాని మోదీని ఉద్దేశించి అన్నారు. హైదరాబాద్ సమావేశంలో మీ ప్రసంగమే కాదు.. మేం అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని సీఎం కేసీఆర్ ప్రధాని మోదీని డిమాండ్ చేశారు. మోదీని చూసి పెద్దపెద్ద పరిశ్రమలు పారిపోతున్నాయని విమర్శించారు. ఎనిమిదేళ్లలో దేశంలో భారీ స్కాంలు జరిగాయన్నారు. రూపాయి పతనం చూస్తే మోదీ పాలన ఏంటో అర్థమవుతోందన్నారు. మోదీ షావుకార్ల సేల్స్‌మేన్ అంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మేక్ ఇన్ ఇండియా అనేది శుద్ధ అబద్ధమని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. మోదీతో తనకు వ్యక్తిగత విభేదాలు లేవన్నారు. మోదీ విధానాలతోనే తమకు అభ్యంతరమని పేర్కొన్నారు. తాము మౌనంగా ఉండబోమని, పోరాటం చేస్తామని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు.

## హైదరాబాద్ డైనమిక్ సిటీ.. ప్రశంసించిన మోదీ

హైదరాబాద్, జులై 2:తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక హైదరాబాద్ మహానగరం అభివృద్ధిలో పరుగులు పెడుతోంది. తెలంగాణ ప్రభుత్వం ఒకవైపు మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తూ.. మరో వైపు విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తోంది. నగరాన్ని పర్యాటకంగా కూడా అభివృద్ధి చేస్తోంది. అలా భాగ్యనగరం విశ్వనగరంగా అభివృద్ధి చెందుతోంది. ఇప్పుడు ఇదే విషయాన్ని సాక్షాత్తు ప్రధాని నరేంద్ర మోదీ సైతం ఒప్పుకున్నారు. జాతీయ కార్యవర్గ సమావేశాల్లో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చిన మోదీ.. ఈ విషయాన్ని చెప్పకనే చెప్పారు.

బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో పాల్గొనేందుకు డైనమిక్ సిటీ హైదరాబాద్ చేరుకున్నాను అని బేగంపేట ఎయిర్ పోర్టుకు చేరుకున్న అనంతరం మోదీ ట్వీట్ చేశారు. హైదరాబాద్ అభివృద్ధిని రాష్ట్ర బీజేపీ నాయకత్వం అంగీకరించనప్పటికీ.. సాక్షత్తూ మోదీనే హైదరాబాద్ డైనమిక్ సిటీ అంటూ ఇన్‌డైరెక్ట్‌గా ప్రశంసలు కురిపించారు. హైదరాబాద్ అభివృద్ధిపై మోదీ ప్రశంసలు కురిపించడం.. రాష్ట్ర బీజేపీ నాయకత్వానికి చెంపపెట్టు లాంటిందని చెప్పొచ్చు.

ఇక మోదీ ట్వీట్‌పై రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పందించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌ను డైనమిక్ సిటీగా గుర్తించినందుకు మోదీకి ప్రత్యేక ధన్యావాదాలు అని తలసాని ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌కు తలసాని.. టీ హబ్ –2, పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనం, ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి ఫోటోలను జత చేశారు.

## క్రెడిట్ కార్డు దారులకు అలర్ట్.. అమల్లోకి కొత్త రూల్స్..

హైదరాబాద్, జులై 2:వ్యాపారులు.. మధ్య తరగతి వర్గాలు.. ఒక మోస్తరు వేతన జీవులు క్రెడిట్ కార్డులు వాడుతుంటారు. క్రెడిట్ కార్డుల వాడకం అంటే బిల్లింగ్.. స్టేట్‌మెంట్..గడువులోగా చెల్లింపులు.. సమస్యలపై ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలు ఉంటాయి. భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) కూడా ఎప్పటికప్పుడు క్రెడిట్ కార్డుల జారీ, వాటి వినియోగంలో పారదర్శకత తదితర అంశాలపై నిబంధనలు సవరిస్తూనే ఉంటుంది. తాజాగా క్రెడిట్ కార్డుల వాడకంలో అనుసరించాల్సిన పద్ధతులను కొన్ని నిబంధనలు అమల్లోకి తెచ్చింది. ఈ నిబంధనలు బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్బీఎఫ్‌సీ)లకు కూడా వర్తిస్తాయి. శుక్రవారం నుంచే ఈ నిబంధనలు అమల్లోకి వచ్చాయి. అవేంటో ఓ లుక్కేద్దామా..!

క్రెడిట్ లిమిట్ పెంపుపై పరిమితులు ఇలా

క్రెడిట్ స్కోర్, ఆదాయం, క్రెడిట్ కార్డ్ బిల్లుల చెల్లింపుల ఆధారంగా సంబంధిత క్రెడిట్ కార్డ్ జారీ సంస్థలు తమ కస్టమర్ల క్రెడిట్ లిమిట్ పెంచుతామని చెబుతాయి. కార్డు మోడల్‌తోపాటు ఖర్చు చేసే మొత్తం లిమిట్ పెంపు తదితర అంశాలు ఉంటాయి. గతంలో బ్యాంకులే లిమిట్ పెంచేసేవి. లిమిట్ పెంచడంతోపాటు కొత్త క్రెడిట్ కార్డులను కస్టమర్లకు పంపేవి. కానీ, ఇక నుంచి కస్టమర్ల అనుమతి లేకుండా లిమిట్ పెంచడానికి వీల్లేదు. కస్టమర్ అనుమతి లేకుండా లిమిట్ పెంచినందుకు కొత్త క్రెడిట్ కార్డు జారీ చేసి, బిల్లు వసూలు చేయడానికి కుదరదని ఆర్బీఐ తెలిపింది. అలా చేస్తే సంబంధిత క్రెడిట్ కార్డు యజమాని ఆర్బీఐ అంబుడ్స్‌మెన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేయొచ్చు. అనుమతి లేకుండా క్రెడిట్ కార్డు లిమిట్ పెంచి చార్జీలు వసూలు చేసినందుకు సంబంధిత క్రెడిట్ కార్డుల జారీ సంస్థలు రెట్టింపు చెల్లించాల్సి ఉంటుంది.

బిల్లింగ్.. పేమెంట్ తేదీ మార్చుకునే వీలు ఇలా

సాధారణంగా క్రెడిట్ కార్డు సంస్థలు తమ నిబంధనల అన్ని క్రెడిట్ కార్డుల బిల్లుల చెల్లింపు తేదీ ఒక్కటే ఉండేందుకు అంగీకరించవు. ఫలితంగా వివిధ క్రెడిట్ కార్డుల బిల్లుల చెల్లింపు తేదీలు వేర్వేరుగా ఉంటాయి. కానీ మారిన నిబంధన ప్రకారం కస్టమర్లు తమ వెసులుబాటును బట్టి తమ క్రెడిట్ కార్డ్ బిల్లు సైకిల్, చెల్లింపు తేదీని ఒకసారి మార్చుకునేందుకు అనుమతించాలని క్రెడిట్ కార్డు జారీ సంస్థలను ఆదేశించింది.

సత్వరం క్రెడిట్ బిల్లులు జారీ చేయాలి

క్రెడిట్ కార్డు బిల్లుల ఇన్‌వాయిస్‌లు ఆలస్యంగా వస్తున్నాయని కస్టమర్ల నుంచి ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో ఇక నుంచి క్రెడిట్ కార్డు బిల్లులను సత్వరం జారీ చేయాలని ఆయా సంస్థలకు ఆర్బీఐ ఆదేశాలు జారీ చేసింది. క్రెడిట్ కార్డు ఏడాది లోపు వినియోగించకుంటే, దాన్ని రద్దు చేసే అధికారం బ్యాంకులకు, ఎన్బీఎఫ్‌సీలకు ఉంటుంది. అయితే, 30 రోజుల ముందు సంబంధిత కస్టమర్‌కు నోటీసులు జారీ చేయాలి. అప్పటికీ కస్టమర్ స్పందించకపోతే ఆ క్రెడిట్ కార్డు రద్దవుతుంది.

వారంలోగా క్రెడిట్ కార్డు యాక్టివేషన్

క్రెడిట్ కార్డు కస్టమర్ చేతికి అందిన వారం లోగా యాక్టివేట్ చేసుకోవాలి. అలా చేసుకోకపోతే ఓటీపీ ద్వారా యాక్టివేట్ చేసుకోవాలని సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. అప్పటికీ యాక్టివేట్ చేసుకోకపోతే, నోటీసు జారీ చేసిన తర్వాత వారం రోజులకు సంబంధిత క్రెడిట్ కార్డును రద్దు చేసే అధికారం బ్యాంకులు, ఎన్బీఎఫ్సీలు, క్రెడిట్ కార్డు జారీ సంస్థలకు ఉంటుంది.

కనీస బిల్లు చెల్లింపుతో ఇదీ సమస్య

క్రెడిట్ కార్డు యూజర్లలో చాలా మంది కనీస మొత్తం బిల్లు మాత్రమే చెల్లిస్తుంటారు. అది క్రెడిట్ కార్డు బాకీలో ఐదు శాతమే. కానీ కనీస మొత్తం బిల్లు మాత్రమే చెల్లిస్తుండటం వల్ల మిగతా మొత్తం బాకీపై అధిక వడ్డీ పడుతూ ఉంటుంది. ఇలా ప్రతి నెలా కనీసమొత్తం బిల్లు చెల్లించడం వల్ల వారు తమ బకాయి మొత్తం చెల్లించడానికి కొన్నేండ్లు పడుతుంది. కనుక ఈ విషయమై కస్టమర్లకు క్రెడిట్ కార్డుల తయారీ సంస్థలు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని ఆర్బీఐ సూచించింది.

క్రెడిట్ కార్డుపై బీమాతో ఇలా బెనిఫిట్

ఒక్కోసారి మన జేబులో ఉన్న క్రెడిట్ కార్డు ఎక్కడో పడిపోతుంది. ఇటువంటప్పుడు అనధికారిక లావాదేవీలు జరిగినప్పుడు నష్టాల పాలయ్యే అవకాశాలే ఎక్కువ. ఈ భారాన్ని తట్టుకోవడానికి బీమా పాలసీ చేయించడం ఉత్తమం అని ఆర్బీఐ సూచిస్తున్నది. ఒక క్రెడిట్ కార్డుపై జరిగే మోసపూరిత.. ఫ్రాడ్ లావాదేవీలకు సంబంధిత కస్టమర్ గానీ, ఆ క్రెడిట్ కార్డు జారీ సంస్థ గానీ బాధ్యత వహించవు. దీనికి బీమా సంస్థలు బాధ్యత వహిస్తాయి. అయితే, క్రెడిట్ కార్డు పడిపోయిన మూడు రోజుల్లో బ్యాంకులో రిపోర్ట్ చేస్తేనే, క్రెడిట్ కార్డు కస్టమర్లు తమకు జరిగే నష్టం నుంచి బయటపడతారు. అప్పుడే ఫ్రాడ్ లేదా మోసాల నుంచి బీమా పరిహారం కోరే హక్కు లభిస్తుంది.

వారంలోపే క్రెడిట్ కార్డు రద్దు చేసుకోవాలి

ఒక్కోసారి క్రెడిట్ కార్డు వాడకం దారులు తమ క్రెడిట్ కార్డులను రద్దు చేసుకోవాలని నిర్ణయానికి వస్తారు. ఆ ప్రక్రియను వారంలోగా పూర్తి చేయాలి. అలా చేయకుంటే ఎనిమిదో రోజు నుంచి రూ.500 ఫైన్ చెల్లించాలి. కార్డు యజమాని పూర్తిగా బకాయి ప్లస్ ఫైన్ చెల్లించినప్పుడే సదరు క్రెడిట్ కార్డు రద్దవుతుంది.

క్రెడిట్ కార్డు వివరాలిలా.

ఇక క్రెడిట్ కార్డు వివరాలన్నీ ఒక్క పేజీలోనే ఇవ్వాలని ఆర్బీఐ ఆదేశించింది. క్రెడిట్ కార్డుల వాడకంపై చార్జీలు, బిల్లింగ్, బిల్లుల బదిలీ తదితర వివరాలన్నీ తెలియజేయాలి. వాటి వినియోగంపై చార్జీలు పెరిగితే 30 రోజుల ముందు కస్టమర్లకు సమాచారం ఇవ్వాలి. కొత్త చార్జీలు భారం అనుకుంటే సంబంధిత యూజర్ తన క్రెడిట్ కార్డు రద్దు చేసుకోవచ్చు. అందుకు కారణాలు వివరిస్తూ క్రెడిట్ కార్డును రద్దు చేయాలని కోరాలి. ఒక్కోసారి వారి సిబిల్ స్కోర్ తక్కువగా ఉండొచ్చు. అటువంటి సందర్భాల్లో క్రెడిట్ స్కోర్ పెంచుకోవడానికి చర్యలు తీసుకునే వీలుంది.

## పినాకిని రైలుకు పుట్టినరోజు వేడుకలు..

విజయవాడ: గత 30 ఏండ్లుగా సేవలందిస్తున్న పినాకినీ ఎక్స్‌ప్రెస్ రైలు పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరిపారు. విజయవాడ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫాం నంబర్ 1 పై కేకు కోసి మరీ రైలుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మీరు విన్నది నిజంగా నిజం. పినాకినీ ఎక్స్‌ప్రెస్ రైలు విజయవాడ–చెన్నై మధ్య నడుస్తుంది.

విజయవాడ రైల్వే స్టేషన్‌లో అలంకరించిన ఇంజిన్ ప్లాట్‌ఫాం 1 పైకి రాగానే అక్కడ వేచి ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా హ్యాపీ బర్త్‌డే టు యు అంటూ కేకలేశారు. దీంతో విషయం తెలియని మిగతా వారు తెల్లమొగమేశారు. తీరా ఆరా తీస్తే.. విజయవాడ–చెన్నై మధ్య నడిచే పినాకినీ రైలు గత 30 ఏండ్లుగా నిరంతరాయంగా సేవలందిస్తున్నది. ఈ రైలును ప్రవేశపెట్టి సరిగ్గా ఇవాల్టికి 30 ఏండ్లు పూర్తయ్యాయి. దాంతో ఈ రైలులో నిత్యం ప్రయాణించే వారు ఆ రైలు డ్రైవర్‌చేత కేకు కోయించారు. అనంతరం ప్రయాణికులు, రైల్వే సిబ్బంది ఇంజిన్‌తో సెల్ఫీలు దిగి ఎంజాయ్ చేశారు. ఈ రైలును నిర్వహిస్తున్న కోచింగ్, మెకానికల్ విభాగం అధికారులు, సిబ్బందిని పినాకిని ఎక్స్‌ప్రెస్ రైలు 1992 జులై 1న ప్రారంభమైంది. విజయవాడ–చెన్నై రూట్‌లో ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు ఎక్కువగా ఈ రైలులో ప్రయాణిస్తుంటారు. ఈ రైలు నడిచే సమయాలు అనుకూలంగా ఉండటంతో కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన ప్రయాణికులు సీజనల్ టికెట్టు తీసుకుని ప్రయాణిస్తారు. 30 ఏండ్లుగా సేవలందిస్తుండటంతో దాని సేవలకు గుర్తుగా ప్రయాణికులు కేకును కోసి పుట్టినరోజు జరుపడం పట్ల తోటి ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.




## విశ్వబ్రాహ్మణులను కించపరిచేలా మాట్లాడలేదు : మంత్రి కేటీఆర్



హైదరాబాద్, జులై 2: విశ్వబ్రాహ్మణులను కించపరిచేలా మాట్లాడినట్లు ప్రచారం చేస్తున్న వార్తలపై టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ స్పందించారు. మొన్న జరిగిన ఒక సమావేశంలో మాట్లాడిన సందర్భంగా.. విశ్వబ్రాహ్మణులను తాను కించపరిచినట్లు కొంతమంది చేస్తున్న ప్రచారం అవాస్తవమని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రతిపక్షాలే కావాలని రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. కులాన్ని తక్కువ చేసి మాట్లాడే కుసంస్కారిని కాదు అని తేల్చిచెప్పారు. కేవలం ఒక ప్రతిపక్ష పార్టీకి సంబంధించిన ఒక నాయకుడిని ఉద్దేశించి అన్న మాట వలన ఎవరైనా బాధపడితే ఆ మాటని ఉపసంహరించుకుంటున్నానని కేటీఆర్ స్పష్టం చేశారు.

## 5న బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం.. సీఎం కేసీఆర్‌కు ఆహ్వానం

హైదరాబాద్, జులై 2:హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం ఈ నెల 5వ తేదీన జరగనుంది. ఈ నేపథ్యంలో దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు.. ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి కల్యాణ మహోత్సవ వేడుకల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు ఆలయ పండితులు వేదమంత్రాలతో ఆశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అర్చకులు, సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి సహా ధర్మకర్త మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## పూర్తి సౌకర్యాలతో 50 పడకల ఆసుపత్రి- తజికిస్థాన్‌కు అప్పగించిన భారత్




న్యూఢిల్లీ, జులై 2: తజికిస్థాన్‌లో పూర్తి సౌకర్యాలతో ఆధునీకరించిన 50 పడకల ఆసుపత్రిని ఆ దేశానికి భారత్ అప్పగించింది. ఆ దేశ రాజధాని దుషాన్‌బే సమీపంలోని బోక్తార్‌లో ఇండియా–తజికిస్థాన్ ఫ్రెండ్‌షిప్ హాస్పిటల్ (ఐటీఎఫ్‌హెచ్)ను 2014 అక్టోబర్‌లో భారత్ ప్రారంభించింది. ఎనిదేళ్లుగా వైద్య సేవలందిస్తున్న ఈ ఆసుపత్రి పునరుద్ధరణ పనులను భారత్ ఇటీవల పూర్తి చేసింది. అత్యంత ఆధునిక వైద్య సౌకర్యాలతో 50 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దింది. సర్జరీ, గైనకాలజీ, మెడిసిన్, పీడియాట్రిక్స్, ఈఎన్‌టీ, డెంటల్ విభాగాలతో సహా అనేక వైద్య విభాగాలు, ఆధునాతన వైద్య పరికాలను ఏర్పాటు చేసింది. ఆపరేషన్ థియేటర్, ఎక్స్–రే యంత్రాలు, ల్యాబరేటరీ, క్రిటికల్ కేర్ అంబులెన్స్‌లు, ఇతర వాహనాలతో సహా పూర్తి సౌకర్యాలతో కూడిన ఇండియా–తజికిస్థాన్ ఫ్రెండ్‌షిప్ హాస్పిటల్ (ఐటీఎఫ్‌హెచ్)తోపాటు దాని బాధ్యతలను జూన్ 11న ఆ దేశానికి భారత్ అందజేసింది. ఈ సందర్భంగా ఇరు దేశాల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాగా, ఎలాంటి లాభాపేక్ష లేకుండా స్నేహ పూర్వక దేశాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలనే భారత విధానానికి అనుగుణంగా తజికిస్థాన్‌తో కలిసి భారత్ నిర్మించిన ఈ హాస్పిటల్ ద్వారా ఇప్పటికే ఆ దేశ ప్రజలకే కాకుండా సైనికులకు కూడా ఉచితంగా వైద్య సేవలను అందిస్తున్నారు. 2014 అక్టోబర్‌లో ప్రారంభైన ఈ ఆసుపత్రి ద్వారా గత ఏనిమిదేళ్లలో లక్షకుపైగా రోగులు చికిత్స పొందారు. గత రెండేళ్లలో సుమారు రెండు వేలకుపైగా సర్జరీలు జరిగాయి. ఇండియన్ ఆర్మీ వైద్యులు, వైద్య సిబ్బంది బృందం తజిక్ ప్రజలకు వైద్య సేవలందించారు. అలాగే తజికిస్థాన్ వైద్యులు, వైద్య సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చారు. దీంతో ఆ దేశ వైద్యులు, సిబ్బంది సంఖ్య పెరుగడంతో అక్కడ సేవలందిస్తున్న భారత వైద్యులు, సిబ్బంది సంఖ్య 72 నుంచి 24కు తగ్గింది.

మరోవైపు ఇండియా–తజికిస్థాన్ ఫ్రెండ్‌షిప్ హాస్పిటల్ (ఐటీఎఫ్‌హెచ్)ను భారత్ ఇటీవల మరింతగా అభివృద్ధి చేసింది. సొంత నిధులతో ఆధునిక వైద్య పరికరాలు, సామగ్రితో పాటు అన్ని సౌకర్యాలను సమకూర్చింది. దీంతో 50 పడకలతో పూర్తిగా తీర్చిదిద్దిన ఆసుపత్రితోపాటు దాని నిర్వాహణ బాధ్యతలు కూడా తజకిస్థాన్‌కు భారత్ అప్పగించింది.

# నూతన ఆవిష్కరణలకు ఆహ్వానం - జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. శరత్.



సంగారెడ్డి, జూలై,02 (నేటి నిజం ప్రతినిధి) ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఆసక్తిగల ఆవిష్కరణ నుండి ఆవిష్కరణలను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. శరత్ శనివారం నాడొక ప్రకటనలో తెలిపారు.

తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తెలంగాణ జిల్లాలలో ఆవిష్కరణల ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అందులో భాగంగా ప్రతి ఇంట ఉన్న ఆవిష్కర్తలు వారి సమస్యలకు పరిష్కారం సొంతంగా కనుగొనేలా ప్రోత్సహిస్తుందన్నారు. ఎంపికైన ఆవిష్కర్తలకు స్వాతంత్ర దినోత్సవం నాడు ఆయా జిల్లాల్లో వారి ఆవిష్కరణలు ప్రదర్శించడానికి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇందులో సాధారణ గృహిణి మొదలు అన్ని రంగాల వారు పాల్గొనవచ్చన్నారు. గ్రామీణ ఆవిష్కరణ ,విద్యార్థుల ఆవిష్కరణ, ప్రారంభ ఆవిష్కరణలు, సూక్ష్మ మరియు చిన్న తరహా పరిశ్రమలలో ఆవిష్కరణలు మొదలైనవి ఉండవచ్చాన్నారు. ఆవిష్కర్త తమ ఆవిష్కరణ ఏ సమస్యను పరిష్కరిస్తుందో స్పష్టంగా చెప్పాలన్నారు. సమస్యకు పరిష్కారం సృజనాత్మకంగా ప్రామాణికంగా ఉండాలన్నారు.

ఆవిష్కర్తలు తమ ఆవిష్కరణకు సంబంధించిన ఆరు వాక్యాల వివరణ, నాలుగు చిత్రాలు, రెండు నిమిషాల వీడియోను, ఆవిష్కరణ పేరు ,వయస్సు, ప్రస్తుత వృత్తి, గ్రామం పేరు, జిల్లా పేరును 9100678543 నంబరుకు వాట్సాప్ ద్వారా ఆగస్ట్ 5వ తేదీ లోపు పంపాలన్నారు.

మరిన్ని వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఫోన్ నెంబర్ +91 99634 23691 లో సంప్రదించవచ్చని సూచించారు.

ఆసక్తి గల జిల్లా లోని ఆవిష్కర్తలు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

# గుంటూరులో అనుమానిత వ్యాధి.. ఒకరు మృతి, పలువురికి అస్వస్థత

గుంటూరు, జులై 2: తెనాలి మండలం పరిధిలోని ఓ గ్రామంలో అనుమానిత వ్యాధి ప్రజలను భయపెడుతున్నది. ఇప్పటికే ఓ 14 ఏండ్ల బాలికను బలిగొనగా.. పలువురు గ్రామస్థులు తీవ్ర అస్వస్థతలో దవాఖానాలో చికిత్స పొందుతున్నారు. కొందరిలో గ్యాస్ట్రోఎంటెరిటిస్ అనే అనుమానిత వ్యాధి లక్షణాలు కనిపించగా.. మరికొందరిలో తీవ్ర డయేరియా లక్షణాలు బయటపడ్డారు. దాంతో గ్రామంలో 25 పడకలతో తాత్కాలిక వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ప్రజలకు అత్యవసర వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆరోగ్య శాఖ మంత్రి విడుదల రజని అధికారులను ఆదేశించారు.

తెనాలికి సమీపంలోని కొలకలూరు గ్రామంలో పలువురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. రెండు రోజుల క్రితం గొరికిపూడి శ్రీనిధి అనే 14 ఏండ్ల బాలిక వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురైంది పరిస్థితి విషమంగా మారడంతో.. ఆమెను తెనాలి ప్రభుత్వ దవాఖానా తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. కాగా, ఇదే లక్షణాలతో పలువురు గ్రామస్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరి అస్వస్థతకు కారణాలు తెలియరాలేదు. 30 మంది సిబ్బందితో కూడిన అత్యవసర వైద్య బృందాన్ని గ్రామానికి పంపించామని, పరిస్థితి అదుపులో ఉన్నదని మంత్రి విడదల రజిని తెలిపారు. కాగా, కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ జీ రాజకుమారి, డీఎంహెచ్ ఓ శోభారాణి గ్రామానికి చేరుకుని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో తాత్కాలిక వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఇక్కడ 25 పడకలతోపాటు అన్ని సౌకర్యాలు కల్పించేలా చూశారు.

ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ఇంటింటి వెళ్లి సర్వే చేపడుతున్నారు. గ్యాస్ట్రోఎంటెరిటిస్ లక్షణాలతో బాధపడుతున్న వారిని గుర్తించే పనిలో ఉన్నారు. బాధితులను ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, తెనాలి సబ్ కలెక్టర్ నిధిమీనాలు పరామర్శించారు. నీటి నమూనాలను సేకరించి పరీక్ష కోసం పంపారు. పైపుల ద్వారా నీటి సరఫరా నిలిపివేసి ఇంటింటికీ ట్యాంకర్లు, వాటర్ క్యాన్ల ద్వారా నీటిని అందించే ఏర్పాట్లు చేశారు. వ్యాధి లక్షణాలతో బాధపడుతున్న వారికి మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని వైద్యులు సూచించారు. డ్రైనేజీ పైపులను మార్చేందుకు త్వరలో పనులు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు.






# గేమింగ్ కెరీర్ లో అవకాశాలపై చర్చించేందుకు టీఎస్ సర్కార్ తో ట్రినిటీ భేటీ




హైదరాబాద్, జులై 2:గేమింగ్ కెరీర్ లో యువతకు ఉన్న అవకాశాలపై చర్చించేందుకు టీఎస్ ప్రభుత్వంతో ట్రినిటీ సమావేశమైంది. బంజారాహిల్స్ రాడిసన్ బ్లూ ప్లాజాలో 2వ పార్టనర్స్ ఫ్యాన్ మీట్ 2022 నిర్వహించింది. గేమింగ్ కెరీర్, యువతకు అవకాశాలపై నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ ప్రముఖులు, ట్రినిటీ గేమింగ్ ఇండియా, ఫేస్ బుక్ గేమింగ్, అభిమానుల మధ్య చర్చా కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా తెలంగాణ ప్రభుత్వ సాంకేతిక, కాలేజియేట్, ఎడ్యుకేషన్ కమిషనర్ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ? గేమింగ్ తెలంగాణ రాష్ట్రంలో ఉపాధి కల్పనతో పాటు, ఆర్థిక ఉత్పత్తికి పెద్ద మూలమన్నారు. ఇలాంటి కాన్ క్లేవ్ నిర్వహించేందుకు హైదరాబాద్ ఉత్తమమైన ప్రదేశమన్నారు. పాఠశాల నుంచి ఉన్నత విద్య వరకు గేమింగ్ ద్వారా నేర్చుకోవడం కంటే మెరుగైన మార్గం మరొకటి లేదన్నారు.

తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్యం (ఐ అండ్ సీ), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ మాట్లాడుతూ గత రెండేళ్లలో గేమింగ్ చాలా పెరిగిందన్నారు.

కొత్త గేమ్ లను రూపొందించేందుకు, పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు గేమింగ్ కమ్యూనిటీని ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తున్నామన్నారు. ట్రినిటీ గేమింగ్ సహ వ్యవస్థాపకుడు అభిషేక్ అగర్వాల్ మాట్లాడుతూ? ట్రినిటీ గేమింగ్ జాతీయ స్థాయిలో గేమింగ్ పరిశ్రమ ఇంటెన్సివ్ ఎదుగుదలలో పాల్గొనేందుకు ఆసక్తిని కలిగి ఉందన్నారు. ట్రినిటీ గేమింగ్ కో ఫౌండర్ శివమ్ రావు మాట్లాడుతూ? ఈ ఈవెంట్ విజయం గేమింగ్ కమ్యూనిటీని ప్రోత్సహించే సానుకూల ఫలితానికి దారి తీస్తుందని నమ్ముతున్నామన్నారు.

# ప్రధానమంత్రి శ్రమ్ యోగి మాన్ దన్ పథకంలో అసంఘటిత కార్మికుల పేర్లు నమోదు చేయాలి



సంగారెడ్డి జూలై 2 ( నేటి నిజం ప్రతినిధి) ప్రధానమంత్రి శ్రమ్ యోగి మాన్ దన్ పథకంలో జిల్లాలో గల అసంఘటిత కార్మికులందరినీ ఎన్రోల్ చేయించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులకు ఆదేశించారు.

శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కార్మిక శాఖ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అసంఘటిత కార్మికుల పెన్షన్ పథకమైన ప్రధానమంత్రి శ్రమ్ యోగి మాన్ ధన్ లో జిల్లా లక్ష్యం మేరకు అర్హులైన అసంఘటిత కార్మికులను ఈ నెల 15 లోపు ఎన్ రోల్ చేయించాలన్నారు.

ఈ పథకం కింద 18 నుండి 40 సంవత్సరాల లోపు వయస్కులు అర్హులన్నారు. నెలసరి ఆదాయం రూ 15 వేల లోపు ఉండాలని, ఇతర పెన్షన్స్ స్కీం లలో సభ్యులు కాని వారు, ఆదాయ పన్ను రిటర్ను దాఖలు చేయని వారు, అసంఘటిత రంగాలలో పనిచేస్తున్న కార్మికులు మాత్రమే ఈ పథకానికి అర్హులని తెలిపారు.

వయస్సు ఆధారంగా 55 రూపాయల నుండి రూ.200 మధ్య జమ చేయాల్సి ఉంటుందన్నారు. సభ్యులు జమ చేసిన మొత్తానికి అంతే మొత్తాన్ని భారత ప్రభుత్వం జమ చేస్తుందని, సంబంధిత వ్యక్తికి 60 సంవత్సరాలు వచ్చినప్పటి నుండి జీవితకాలం ప్రతి నెల రూ.3 వేల పెన్షన్ వారి అకౌంట్లో జమ చేయడం జరుగుతుందన్నారు.

ఖాతాదారు 60 సంవత్సరాల లోపు మరణించినట్లయితే జమ అయిన మొత్తాన్ని నామినికి చెల్లించడం జరుగుతుందని, కామన్ సర్వీస్ సెంటర్లో ఎన్ రోల్ చేసుకోవాలని జిల్లాలోని అసంఘటిత కార్మికులకు అవగాహన కల్పించి పెద్ద మొత్తంలో ఈ పెన్షన్ పథకంలో నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలని కార్మిక శాఖ అధికారులకు సూచించారు.

ఈ పథకంలో జిల్లా లక్ష్యం 6,700 కాగా ఇప్పటివరకు వెయ్యి మంది నమోదు అయ్యారని తెలిపారు. ఆయా సహాయ కార్మిక శాఖ అధికారులు జులై 15 లోగా నిర్ణీత లక్ష్యాన్ని సాధించేలా ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, కార్మిక శాఖ సహాయ కమిషనర్ బి. జాన్సన్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు యాదయ్య, వీరేశం, ప్రవీణ్ పాల్గొన్నారు.

# గోఆధారిత ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో శ్రీవారికి నైవేద్యం, ప్రసాదాలు

తిరుమల, జూలై,02 గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో తిరుమల శ్రీవారికి నైవేద్యం, ఇతర ప్రసాదాలు తయారుచేసేందుకు వీలుగా మలి విడతలో 12 రకాల ఉత్పత్తులు సేకరించేందుకు రాష్ట్ర రైతు సాధికార సంస్థ, మార్క్‌ఫెడ్‌లతో టీటీడీ ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి వివరాలను వెల్లడించారు. తిరుపతిలోని పద్మావతి విశ్రాంతి గృహంలో రాష్ట్ర రైతు సాధికార సంస్థ, మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.

తొలివిడతలో 500 మెట్రిక్ టన్నుల శనగలు కొనుగోలు చేయగా మలి విడతలో ప్రస్తుతం బియ్యం, శనగలు, బెల్లం, కంది పప్పు, పెసలు, పసుపు, వేరుశనగ, మిరియాలు, ధనియాలు, ఆవాలు, చింతపండు, ఉద్దిపప్పు సేకరించాలని నిర్ణయించామన్నారు. వీటిని ప్రకృతి వ్యవసాయ రైతుల నుంచి రాష్ట్ర రైతు సాధికార సంస్థ కొనుగోలు చేస్తుందని, ఈ సంస్థ నుంచి మార్క్‌ఫెడ్ కొనుగోలుచేసి తగిన విధంగా మార్పుచేసి టీటీడీకి అందిస్తుందన్నారు.

టీటీడీ కోసం రైతు సాధికార సంస్థ ఎంపిక చేసిన రైతులు భక్తిశ్రద్ధలతో పంటలు పండించాలని సూచించారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ రసాయన ఎరువులు వినియోగించవద్దని విజ్ఞప్తి చేశారు. క్రమక్రమంగా హోటళ్లు, ఇతర సంస్థలు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించాలని, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయానికి పూర్వ వైభవం తీసుకురావాలని టీటీడీ ఈవో కోరారు.

# డయేరియా రోగులను పరామర్శించిన మంత్రి విడదల రజిని




అమరావతి, జులై 2: మండల పరిధిలోని కొలకలూరు గ్రామంలో డయేరియా ప్రబలి వ్యాధిగ్రస్తులైన వారిని శనివారం రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని జిల్లా అధికారులతో గ్రామంలోకి వచ్చి పరామర్శించారు. ఈ సందర్భంగా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో వైద్య సేవలు మెరుగుపరిచి బాధితులకు అండగా ఉంటామని, ఎలాంటి విపత్కర పరిస్థితి ఎదురైనా ఎదుర్కోవటానికి సిద్ధంగా ఉన్నామని, వ్యాధి నివారణకు వైద్య బృందాలను ఏర్పాటుచేసి మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. గ్రామస్తులు ఎవరూ భయపడవలసిన అవసరం లేదన్నారు. జిల్లా కలెక్టర్ యం.వేణుగోపాలరెడ్డి జాయింట్ కలెక్టర్ వివేక్ స్థానిక శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్, బాధితులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా ,తదితరులు పాల్గొన్నారు

# యాసంగి వడ్ల కొనుగోళ్లు పూర్తి.. సీఎం కేసీఆర్ నిర్దేశం మేరకు లక్ష్యం పూర్తి: మంత్రి గంగుల

హైదరాబాద్, జులై 2: సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రస్తుత యాసంగి సీజన్‌లో విజయవంతంగా ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేశామని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. రైతులకు సకాలంలో డబ్బులు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోందని చెప్పారు. ఈ మేరకు యాసంగి ధాన్యం కొనుగోళ్లపై శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు.

ఈ ఏడాది రబీలో రూ.9916 కోట్ల విలువైన 50.67లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని దాదాపు 9లక్షల 52వేల మంది రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేశామన్నారు. ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వమే సమకూర్చుకుని ఓపీఎంఎస్ లో నమోదైన 9724 కోట్లకు గాను 9680 కోట్లను రైతులకు సకాలంలో చెల్లించామన్నారు. ఓపీ ఎంఎస్‌లో నమోదైన ప్రకారం వెంట వెంటనే చెల్లింపులు కొనసాగుతాయన్నారు. అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలో 6,42,894 మెట్రిక్ టన్నులను, అత్యల్పంగా ఆదిలాబాద్‌లో 322 మెట్రిక్ టన్నులను సేకరించామని చెప్పారు.

2014-15 సీజన్ నుంచి ఇప్పటి వరకు దాదాపు ఒక కోటి ఎనిమిదివేల కోట్లను ప్రభుం రైతులకు అందజ???సిందన్నారు. ఎంఎస్‌పీ ప్రకారం పంట సేకరణ చేయడమే కాకుండా కరోనా, అకాల వర్షాలు, గోనె సంచుల ఇబ్బందులు వంటి విపత్కర పరిస్థితుల్లోనూ రైతులకు ఇబ్బంది కలగకుండా పెద్ద సంఖ్యలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకూ 6కోట్ల 6లక్షల 53 వేల 234 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. దేశంలో రికార్డు స్థాయిలో ధాన్యాన్ని సేకరిస్తూ రైతులకు సంపూర్ణంగా అండగా నిలుస్తున్నామని, ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వానికి దేశంలో ఏ ప్రభుత్వం కూడా పోటీ రాదన్నారు. రైతు బంధు, రైతు భీమా , 24 గంటల ఉచిత కరెంటు, ధాన్యం సేకరణ తదితర రైతు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న ఏకైక రాష్ట్ర ప్రభుత్వం కూడా తెలంగాణదేనన్నారు.

# రాజమండ్రిలో పౌర సమస్యల పరిష్కారానికి వాట్సాప్ నంబర్

తూర్పు గోదావరి జిల్లా, జులై 2: ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు వీలుగా రాజమండ్రిలో ఒక వాట్సాప్ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఈ నంబర్ ద్వారా ప్రజల నుంచి వచ్చే సమస్యలపై అధికారులు చర్యలు తీసుకోనున్నారు. ఈ ప్రక్రియ ద్వారా పౌర సేవలకు ఆటంకాలు ఏర్పడవని మున్సిపల్ పరిపాలనా శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేశ్, ఎంపీ భరత్ రామ్ అభిప్రాయపడ్డారు. రాజమండ్రిలో ఏర్పాటుచేసిన ఒక కార్యక్రమంలో ఈ మేరకు వాట్సాప్ నంబర్‌ను మంత్రి సురేష్, ఎంపీ భరత్‌రామ్ ఆవిష్కరించారు. నగర ప్రజలు తమ సమస్యలను 94940 60060 వాట్సాప్ నంబర్‌కు పంపి పరిష్కారమయ్యేలా చూడాలని కలెక్టర్ కే మాధవీలత సూచించారు.

ఇంజినీరింగ్, వాటర్ వర్క్స్, మెప్మా తదితర శాఖల అధికారులు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించే ముందు సంబంధిత పనుల వివరాలను ప్రదర్శించాలని మున్సిపల్ మంత్రి ఆదిమూలపు సురేష్ ఆదేశించారు. పనులు పూర్తికాగానే ప్రజాప్రతినిధులతో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో మంత్రి సమీక్షించారు. ప్రతి అభివృద్ధి పని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. తాగునీరు, పారిశుద్ధ్యంపై అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పట్టణాభివృద్ధికి మంజూరైన రూ.125 కోట్లతో చేపట్టనున్న పనుల పురోగతిని మంత్రి సమీక్షించారు.

ఇండోర్ స్టేడియం, కంబాల చెరువు, ఈట్ స్ట్రీట్, రివర్ ఫ్రంట్ బండ్, మల్టీ లెవల్ కార్ పార్కింగ్, మోడల్ రోడ్లు, పార్కులు, అర్బన్ హెల్త్ క్లినిక్‌లు తదితర సమగ్ర అభివృద్ధిపై పీపీటీ ద్వారా అధికారులు మంత్రి సురేశ్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, డీసీసీబీ చైర్మన్ వీర్రాజు, వైసీపీ రాజమండ్రి రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్, రుడా చైర్‌పర్సన్ ఎం షర్మిలారెడ్డి, మున్సిపల్ కమిషనర్ కే దినేష్ కుమార్, మున్సిపల్ ఎస్‌ఈ పాండురంగ రావు, ఎంహెచ్‌ఓ వినూత్న తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలే మనల్ని మళ్లీ గెలిపిస్తాయి: ఏపీ డిప్యూటీ సీఎం

విజయనగరం, జులై 2: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో తమ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలే తమను మరోసారి అధికారంలోకి తీసుకొస్తాయని ఏపీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. ప్రజల కోసం తీసుకొస్తున్న ప్రణాళికలపై విస్తృతంగా ప్రచారం చేపట్టాలని పార్టీ నాయకులు, కార్యకర్తలను వారు కోరారు. జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన పలు సంక్షేమ కార్యక్రమాలు ప్రజల హృదయాలను గెలుచుకుంటాయనడంలో ఎలాంటి ఔచిత్యం లేదన్నారు.

నియోజకవర్గ స్థాయి ప్లీనరీలు పూర్తయిన తర్వాత విజయనగరంలో జిల్లా స్థాయి ప్లీనరీని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, బొత్స హాజరై కార్యకర్తలను ఉత్సాహపరిచారు. విజయనగరం జిల్లా పరిధిలోని అన్ని నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు సభనుద్దేశించి ప్రసంగించారు. అంతకుముందు వారు పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా జై జగన్.. జై వైసీపీ అంటూ పార్టీ శ్రేణులు చేసిన నినాదాలు మిన్నంటాయి.

సమాజంలోని అన్ని వర్గాలు వైసీపీ వెంటే ఉన్నారని, 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలు మళ్లీ సంగీత బాట పడతాయని డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో కార్యకర్తలు ముందుకు రావాలని సూచించారు. రాష్ట్రంలో వైసీపీ ప్రతిష్టను టీడీపీ, ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయని బొత్స సత్యనారాయణ అన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటిని పరిష్కరించడంలో నాయకులు ముందు వరుసలో ఉండాలన్నారు. ఈ సమావేశంలో విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

# తిరుపతిలో పెరుగుతున్న కొవిడ్ కేసులు.. ఆందోళనలో భక్తులు

తిరుపతి, జులై 2: శ్రీ వేంకటేశ్వరస్వామి కొలువై ఉన్న తిరుపతిలో గత 10 రోజులుగా కొవిడ్ పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతున్నది. భక్తులు ఎలాంటి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడం వల్ల కేసుల సంఖ్య పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. భక్తులను కట్టడి చేయడంలో అధికారులు పెద్ద పట్టించుకున్న దాఖలాలు లేకపోవడంతో కొవిడ్ కేసులు పెరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. శ్రీవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు ఆందోళన చెందుతున్నారు.

యాత్రీకులు ఎక్కువగా వచ్చే తిరుపతిలో ఇటీవల కరోనా పాజిటివ్ కేసుల సంఖ్యలో పెరుగుదల కనిపిస్తున్నది. గత వారం, పది రోజులుగా ఈ సంఖ్య మెల్లమెల్లగా పెరుగుతున్నది. కొవిడ్ కేసులు పెరుగుతున్నా అధికారులు పరిస్థితిని సమీక్షించేందుకు, నివారణ చర్యలు తీసుకోవడానికి సమీక్ష సమావేశాలు నిర్వహించడం లేదు. భద్రతా ప్రోటోకాల్‌లపై మార్గదర్శకాలు కూడా ఇంతవరకు జారీ చేయకపోవడంతో భక్తులు ఆందోళనకు గురవుతున్నారు. దాదాపు 90 శాతం మంది ప్రజలు మాస్కులను ఉపయోగించడం లేదని, శానిటైజర్లను విస్మరిస్తున్నారు. నగరంలో జరుగుతున్న వివిధ రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొంటున్న నాయకులు, పార్టీల శ్రేణులు మాస్కులు ధరించడంలేదు. అదేవిధంగా రైల్వే స్టేషన్లు, విమానాశ్రయం వంటి బహిరంగ ప్రదేశాలలో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తున్నది.

తిరుపతి నగరం, పరిసర ప్రాంతాల్లో శుక్రవారం 13 కేసులు నమోదయ్యాయి. బుధవారం 19, గురువారం 21 కేసులు వచ్చాయి. ప్రజలను హెచ్చరించడంలో అధికారులు ఉదాసీనంగా ఉంటున్నారు. రోజువారీ నిర్వహిస్తున్న పరీక్షల సంఖ్య, వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న కొవిడ్ బెడ్‌లపై సమాచారం అందుబాటులో లేదు. అయితే, రుయా ఆసుపత్రి అధికారులు మాత్రం 40 ఆక్సిజన్, 80 నాన్-ఆక్సిజన్ పడకలతో పాటు 120 పడకలతో ప్రత్యేక కోవిడ్ వార్డును అందుబాటులో ఉంచారు. ఆర్‌టీ-పీసీఆర్ పరీక్షల స్వాబ్ సేకరణ కేంద్రాన్ని ఓపీ బ్లాక్ సమీపంలో నెలకొల్పారు.

# మోదీ ఫోన్ కాల్‌తో దిగి వచ్చిన ఫడ్నవీస్- డిప్యూటీ సీఎం పదవికి అంగీకారం

ముంబై, జులై 2:మహారాష్ట్ర రాజకీయ మలుపులకు కీలకమైన బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్, చివరకు ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్ కాల్‌తో దిగివచ్చారు. ఆయన మాటకు గౌరవం ఇచ్చి డిప్యూటీ సీఎంగా ఉండేందుకు అంగీకరించారు. ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలో శివసేన ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేసేలా చేసి మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) ప్రభుత్వం పడిపోయేందుకు తెరవెనుక చక్రం తిప్పిన దేవేంద్ర ఫడ్నవీస్, బీజేపీ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయంతో కంగుతున్నారు. మరోసారి సీఎం కావచ్చని ఆయన ఆశ పడగా, ఆ పోస్ట్‌ను షిండేకు బీజేపీ ఆఫర్ చేసింది. పార్టీ నిర్ణయంతో షాకైన ఫడ్నవీస్, షిండేను సీఎంగా తన నోటితోనే ప్రకటించారు. అయితే షిండే ప్రభుత్వంలో తాను ఉండనంటూ ఆ సందర్భంగా మీడియాతో అన్నారు.కాగా, మహారాష్ట్ర రాజకీయ పరిణామాల్లో కీలకంగా వ్యవహరించిన ఫడ్నవీస్ సొంతంగా తీసుకున్న ఈ నిర్ణయంపై బీజేపీ అధిష్ఠానం కూడా షాక్ అయ్యింది. ప్రభుత్వంలో ఆయన లేకపోతే బీజేపీకి కంట్రోల్ ఉండదని భావించింది. దీంతో డిప్యూటీ సీఎం పదవిని చేపట్టాలని ఫడ్నవీస్‌పై బీజేపీ ఒత్తిడి తెచ్చిందని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఇందులో భాగంగానే బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతోపాటు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ట్వీట్లు చేశారని చెప్పారు. అయినప్పటికీ ఫడ్నవీస్ సుముఖంగా లేకపోవడంతో చివరకు ప్రధాని నరేంద్ర మోదీ రంగంలోకి దిగి ఆయనకు రెండు సార్లు ఫోన్ చేశారని వివరించారు. దీంతో మోదీ ఫోన్ కాల్స్‌కు గౌరవం ఇచ్చిన ఫడ్నవీస్ చివరకు డిప్యూటీ సీఎం పోస్ట్‌కు అంగీకరించారని బీజేపీ వర్గాలు ఏఎన్ఐ వార్తా సంస్థకు వెల్లడించాయి.

# ఇంజనీరింగ్ నిరుద్యోగులకు శుభవార్త..

## కొత్తగా 1,663 పోస్టుల భర్తీకి అనుమతులు

హైదరాబాద్, జులై 2: హైదరాబాద్ : రాష్ట్రంలోని ఇంజినీరింగ్ నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త వినిపించింది. ఇప్పటి వరకు 45,325 పోస్టుల భర్తీకి అనుమతులు ఇచ్చిన ఆర్థిక శాఖ , తాజాగా మరో 1,663 ఖాళీల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

పోలీసు, ఫారెస్టు, ఫైర్, జైళ్లు, రవాణా, ఎక్సైజ్, పంచాయతీరాజ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, సాంఘీక సంక్షేమ శాఖ, విద్య, ఆరోగ్య శాఖల్లో ఖాళీల భర్తీకి అనుమతులు ఇచ్చిన ఆర్థికశాఖ ఇప్పుడు ఇంజనీరింగ్ విభాగంలో ఖాళీల భర్తీకి పచ్చ జెండా ఊపింది.

ఇంజనీరింగ్ పట్టభద్రులకు ఇది సువర్ణావకాశం. ఇరిగేషన్, ఆర్ డం బి శాఖల్లోని 1522 పోస్టుల భర్తీకి క్లియెరెన్స్ ఇచ్చింది. ఇంజనీర్ ఇన్ చీఫ్, ఇరిగేషన్ ( అడ్మినిస్ట్రేషన్, హైదరాబాద్) లో 1238 పోస్టులు, ఇంజనీర్ ఇన్ చీఫ్ ( ఆర్ అండ్ బి, ఎన్. హెచ్, అడ్మినిస్ట్రేషన్, ఆర్వోబీ/ ఆర్ యూబీ ఎస్, హెచ్ వోడీ) లో284 పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతులు మంజూరు చేసింది.

వీటితో పాటు డైరెక్టర్ ఆఫ వ ర్క్స్ అక్కౌంట్స్ హెచ్‌వోడీలో 53 , డెరెక్టర్ ఆఫ్ గ్రౌండ్ వాటర్ డిపార్ట్మెంట్ (హెచ్‌వోడీ) లో 88 ఉద్యోగాల భర్తీకి అనుమతినిచ్చింది. ఈ మేరకు ఆర్థిక శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. దీంతో ఇప్పటి వరకు ప్రభుత్వం 46,998 పోస్టుల భర్తీకి అనుమతులు ఇచ్చినట్లయింది. ఇప్పటికే ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు ఇవ్వడం జరిగింది.

మిగిలిన పోస్టుల భర్తీకి అనుమతులు ఇచ్చే ప్రక్రియ కసరత్తును ఆర్థిక శాఖ అధికారులు ముమ్మరం చేశారు. మరి కొద్ది రోజుల్లో మిగిలిన ఖాళీల నియామకాలకు ఆర్థిక శాఖ అనుమతులు మంజూరు చేయనుంది.

# టీడీపీలో చేరితే 30 కోట్లిస్తామన్నారు: మంత్రి రాజన్న దొర

విజయనగరం జిల్లా, జులై 2: ఆంధ్రప్రదేశ్ మంత్రి రాజన్న దొర సంచలన వ్యాఖ్యలు చేశారు. టీడీపీలో చేరితే తనకు రూ.30 కోట్లు ఇచ్చేందుకు బేరమాడారని ఆరోపించారు. 2014 ఎన్నికల్లో విజయనగరం జిల్లాలోని సాలూరు నుంచి రాజన్న దొర వైసీపీ అభ్యర్థిగా బరిలో నిలిచి ఘనవిజయం సాధించారు. ఆ సమయంలో 23 మంది వైసీపీ ఎమ్మెల్యేలు టీడీపీలో చేరారు. వారిలో నలుగురికి మంత్రి పదవులను కూడా దక్కాయని విజయనగరం జిల్లా స్థాయి వైసీపీ ప్లీనరీలో ఈ విషయాలను వెల్లడించారు.

తాజాగా రాజన్న దొర ఆనాటి సంగతులను గుర్తుచేసుకుంటూ టీడీపీ అధినేతపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆ ఎన్నికల్లో విజయం సాధించిన తనను పార్టీ మారమంటూ తీవ్ర ఒత్తిడి చేశారన్నారు. తమ పార్టీలో చేరాలని ప్రలోభపెట్టారని చెప్పారు. పిల్లల చదువులను తామే చూసుకుంటామని, అలాగే, రూ.30 కోట్ల నగదుతోపాటు అమరావతిలో ఒక ఇల్లు ఇస్తామని ఆఫర్ ఇచ్చారని రాజన్న దొర వెల్లడించారు. అయితే తానకు జగన్‌పై ఎంతో నమ్మకం ఉన్నదని, ఆ నమ్మకమే తాను పార్టీని వీడకుండా చూసిందని రాజన్న దొర తెలిపారు.

అంతలా ప్రలోభపెట్టినా వారి పార్టీలోకి వెళ్లకుండా తానింతకాలం ఎదురు చూసినందుకు మంత్రి పదవితో పాటు ఉప ముఖ్యమంత్రి పదవి కూడా అందిందని చెప్పారు. తనలా పార్టీకి అంకితభావంతో పనిచేసేవారికి, పార్టీ అధినేతనే నమ్ముకున్నవారికి ఏనాటికైనా ఫలితం అందుతుందని, దానికి తానే నిదర్శనమన్నారు.

# ఇద్దరు ఎంపీల నుంచి అధికారం వచ్చే వరకు...: పవన్



అమరావతి, జులై 2: విభజన తర్వాత ఇక్కడ టీడీపీకి.. అక్కడ టీఆర్ఎస్‌కి అవకాశం ఇచ్చారని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా ఏర్పడే ప్రభుత్వాలు నిలబడవన్నారు. దేశంలో మత ప్రస్తావన లేని ప్రభుత్వాలు రావాలని చెప్పారు. దేశంలోని భాష, యాసను అందరూ గౌరవించాలని ఆయన సూచించారు. ప్రాంతీయతను గుర్తించకపోతే జాతీయవాదం రాదన్నారు. ఇద్దరు ఎంపీల నుంచి అధికారం వచ్చే వరకు బీజేపీ పోరాటం చేసిందన్నారు. ఏ పార్టీ అయినా మొదట చిన్నగానే ప్రారంభమవుతుందన్నారు. ప్రస్తుతం రాజకీయాల్లో పురుషుల ఆధిక్యమే ఉందన్నారు. జనసేనలో మహిళలను చైతన్యవంతులుగా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.




# ఓవర్ లోడ్ కర్ర లారీలకు భారీ ఫైన్..



కరీంనగర్ , జులై 2: (నేటినిజం ప్రతినిధి): ఓవర్ లోడ్ కర్ర లారీలపై పోలీసులు కఠినచర్యలు ప్రారంభించారు. ప్రమాదకరంగా కర్రలు తీసుకెళ్లొద్దని పలుమార్లు హెచ్చరించినా పెడచెవిన పెట్టడంతో భారీ జరిమానాలు విధించారు. శనివారం బసంత నగర్ టోల్ ప్లాజా వద్ద సబాబుల్ కర్రలతో ప్రమాదకరంగా వెళుతున్న 20 లారీలను నిలిపివేయించి రవాణా శాఖ అధికారులతో భారీగా జరిమానాలు వేయించారు. ఈసందర్భంగా పెద్దపల్లి డీసీపీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ లారీలు ఓవర్ లోడ్, అతి వేగంగా వెళ్లడం వల్ల తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. లారీకి బయటకు వచ్చేలా కర్రలు ఉంటే విద్యుత్ తీగలకు తగిలి షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగే అవకాశాలున్నాయన్నారు. అలాగే ఓవర్ లోడ్‌తో డ్రైవర్స్‌కి లారీ బ్యాలెన్స్ చేయడం కూడా కష్టతరమవుతుందన్నారు.

ఇలాంటి లారీలు రోడ్లపై నిలిచిపోయిన సమయంలో ట్రాఫిక్‌కు కూడా అంతరాయం కలుగుతుందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఓవర్ లోడ్‌తో వెళ్లిన లారీలను సీజ్ చేయడంతోపాటు- చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికైనా తీరు మారకపోతే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో పెద్దపల్లి ఏసీపీ సారంగపాణి, సీఐలు ప్రదీప్‌కుమార్, అనిల్‌కుమార్, ఎంవీఐ రవికుమార్, ఎస్ఐలు మహేందర్, శివానీ, నాగరాజుతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

# సంకల్పంతో పోటి పరీక్షలకు సంసిద్ధమైతే విజయం చేరుకోవడం కష్టమేమి కాదని వైరా ఏసీపీ సాధన రష్మీ పెరుమాళ్ అన్నారు






ఖమ్మం, జులై 2: (నేటినిజం ప్రతినిధి): పోలీసు ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న యువతకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్ పర్యవేక్షణలో ఎస్ఆర్ డబిజిఎన్ఆర్ కాలేజ్ లో ఇస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమం నేటితో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి వైరా ఏసీపీ ముఖ్యతిథిగా హజరైయ్యారు.

మే 11 న ప్రారంభమైన ఈ శిక్షణ కార్యక్రమంలో సిలబస్‌లో బేసిక్స్ నుంచి మొదలుకుని జనరల్ స్టడీస్, ఆర్థమెటిక్, రీజనింగ్‌పై ప్రత్యేక దృష్టి, రన్నింగ్, ఈవెంట్స్‌లో ఎలాంటి మెళకువలు పాటించాలి? పరిగెత్తే సమయంలో సమయాన్ని ఎలా మేనేజ్ చేసుకోవాలి. రాత పరీక్షల్లో ఎలాంటి పద్ధతులు అవలంబించాలో శిక్షణ కాలంలో వివరించారు.

ఈ సందర్భంగా వైరా ఏసీపీ మాట్లాడుతూ..ప్రస్తుత పోటీ ప్రపంచంలో పోలీసు శాఖలో ఉద్యోగం కోసం తీవ్రమైన పోటీ నెలకొన్న నేపథ్యంలో అందుబాటులో వున్న సమయం చాలా విలువైనదని, అనవసరమైన వాటికోసం సమయాన్ని వృధా చేసుకోవద్దని సూచించారు.

తెలంగాణ రాష్ట్ర సర్కారు పెద్ద సంఖ్యలో పోలీసు ఉద్యోగాల ఖాళీలు భర్తీ చేయడంతో పాటు యువకులకు అందించిన ఉచిత శిక్షణ ఇవ్వడం గొప్ప అవకాశంగా భావించి పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు.

అనంతరం ఇండోర్ తరగతులలో ఉత్తమ ప్రతిభ చూపిన అభ్యర్థులు జరీనాబేగం, ఎస్కె. మీరా సాహెబ్, అవుట్ డోర్ లో ప్రతిభ చూపిన లోకేష్, సునీత కు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపల్ జాహీరుల్లా, సిఐ తుమ్మ గోపి, ఆర్ ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

# మోదీ గోబ్యాక్.. ప్రధానికి వ్యతిరేకంగా రాష్ట్రంలో మిన్నంటిన నిరసనలు




హైదరాబాద్, జులై 2:ప్రధాని మోదీ నేడు హైదరాబాద్ వస్తున్నారు. రెండు రోజులపాటు నగరంలోనే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాని రాకను వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు నిరసనకు దిగాయి. ఎస్సీ వర్గీకణను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఎంఆర్‌పీఎస్ కార్యకర్తలు యాదాద్రి జిల్లా చౌటుప్పల్ సమీపంలోని ధర్మోజీగూడ వద్ద జాతీయరహదారిపై ధర్నా చేపట్టారు. టైర్లు కాల్చివేసి రోడ్డుపై బైటాయించారు. మోదీ గో బ్యాక్ అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. దీంతో విజయవాడ జాతీయ రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏఐటీయూసీ నాయకులు కరీంనగర్‌లో ధర్నాకు దిగారు. కరీంనగర్‌లోని కమాన్ చౌక్‌లో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఇక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఆర్థిక నేరగాళ్ల వేషంలో ఉన్న కొందరు బై బై మోదీ అంటూ ప్లకార్డు ప్రదర్శించారు. తాము బ్యాంకును మాత్రమే దోచుకుంటా మని, మీరు మొత్తం దేశాన్నే దోచుకుం టున్నారని పేర్కొంటూ నిరసన వ్యక్తంచేశారు.ఖమ్మంలో ఎంఆర్‌పీఎస్ సడక్ బంద్ నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగా నాయకన్ గూండో వద్ద ఖమ్మం-సూర్యాపేట ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. అధికారంలోకి రాగానే వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పిన బీజేపీ.. ఇప్పటికీ ఆ హామీని నెరవేర్చకపోవడంతో నిరసనకు దిగారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష..

కరీంనగర్ , జులై 2::మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరికీ జైలు శిక్ష విధిస్తూ పెద్దపల్లి జూనియర్ సివిల్ జడ్జి రాణి తీర్పునిచ్చారు.

శనివారం పట్టణంలో వాహనాల తనిఖీల్లో భాగంగా మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిని పెద్దపెల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్ కోర్టులో హాజరు పరిచారు. విచారణ జరిపిన న్యాయమూర్తి జైలు శిక్ష విధించారు.

పెద్దపల్లి మండలం బొంపల్లి గ్రామానికి చెందిన అరికెళ్ల నవీన్ కు మొదటిసారి మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో రెండు రోజులు, రెండవసారి మద్యం తాగి వాహనం నడిపిన కేసులో నాలుగు రోజుల జైలు శిక్ష విధించారు. మూలసాల కు చెందిన రాయిని సతీష్ మద్యం సేవించి వాహనం నడిపిగా క రెండు రోజులు జైలు శిక్ష విధించారు.

మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, మద్యం సేవించి వాహనాలు నడిపే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు.

# యశ్వంత్ సిన్హా కు ఎంపీ రవిచంద్ర స్వాగతం

ఖమ్మం, జులై 2: (నేటినిజం ప్రతినిధి): విపక్షాల రాష్ట్రపతి అభ్యర్థి యశ్వంత్ సిన్హా కు హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర స్వాగతం పలికారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో పలువురు మంత్రులు, ఎంపీలు సిన్హా కు ఘనంగా స్వాగతం పలికారు. ఎయిర్ పోర్ట్ నుంచి ఆయనను నెక్లెస్ రోడ్డు లోని జలవిహార్ వరకు టీఆర్ఎస్ శ్రేణులు భారీ ర్యాలీతో తోడ్కొని వచ్చారు. అనంతరం అక్కడ సిన్హాకు మద్దతుగా టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలంతా భోజన విరామ సమయంలో సమావేశమయ్యారు. జిల్లా రాజకీయాల గురించి చర్చించి, భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకున్నారు. ఈ సమావేశంలో ఎంపీ రవిచంద్ర కూడా పాల్గొన్నారు.



# ఖమ్మం గ్రైన్ మార్కెట్ తెరాసకెవి దడవాయి సంఘం నూతన కమిటీ ఎన్నిక




ఖమ్మం, జులై 2: (నేటినిజం ప్రతినిధి): శనివారం ఖమ్మం గ్రైన్ మార్కెట్ తెరాస కె వి దడవాయి సంఘం ఎన్నికల్లో ఎలక్షన్ ఆఫీసర్ గా తెరాస కె వి టాటూ నగర అధ్యక్షుడు పాల్వంచ కృష్ణ ఎలక్షన్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరై ఎలక్షన్లో గెలుపొందిన వారికి నియామక పత్రాలు అందించిన ఖమ్మం సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, టిఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, ఏఎంసి చైర్మన్ లక్ష్మీ ప్రసన్న. గేలుపొందిన వారు

అధ్యక్షులు - మోటే కుమార్, ప్రధాన కార్యదర్శి - దూపా కోటేశ్వరరావు, కోశాధికారి - చింతం సైదులు, ఎన్నికయ్యారు.

ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ వెంకటేశ్వర్లు, టిఆర్ఎస్కెవి జిల్లా నాయకులు ఎండి పాషా, మాటేటి నాగేశ్వరావు, కన్నం ప్రసన్న, ఎర్ర అప్పారావు, గజ్జల వెంకన్న, బుర్రి వినయ్ కుమార్, తెరాస పార్టీ నగర కార్యదర్శి ఈషాంక్, వేమ సెల్వ రాజు, దుర్గా ప్రసాద్ గుప్తా, ఎస్కె. సలీం, దేవ మరియు దడవాయి సంఘం కార్మికులు పాల్గొన్నారు.

# ఉస్మానియా విద్యార్థులకు సివిల్ సర్వీసెస్ అకాడమీ

హైదరాబాద్, జులై 2: గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులను సైతం సివిల్స్ సాధించేలా ప్రోత్సహించేందుకు త్వరలోనే అన్ని సౌకర్యాలతో ఉస్మానియా విద్యార్థులకు సివిల్ సర్వీసెస్ అకాడమీ అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఓయూ ఉపకులపతి ప్రొఫెసర్ డి.రవిందర్ యాదవ్ తెలిపారు. "విద్యార్థిగా చేరండి సివిల్ సర్వెంట్ గా వెళ్లండి" అనే నినాదంతో ప్రణాళిక అమలు చేయనున్నట్లు చెప్పారు.కుటుంబ నేపథ్యం ఏదైనా పట్టుదల, వ్యూహం ఉంటే సివిల్ సర్వీసెస్ సాధించటం సాధ్యమేనని ఇటీవల ఎంపికైన అభ్యర్థులు నిరూపించారని అన్నారు. 2021లో సివిల్స్ సాధించిన వారిని బీసీ సంక్షేమ శాఖ ఉస్మానియా యూనివర్శిటీ తో కలిసి ఘనంగా సత్కరించింది. ఠాగూర్ ఆడిటోరియంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి పెద్ద ఎత్తున విద్యార్థులు హాజరయ్యారు. సివిల్స్ విజేతలు తమకు ఎదురైన అనుభవాలను ఈ సందర్భంగా ఉస్మానియా విద్యార్థులతో పంచుకున్నారు.

వచ్చే ఏడాది ఫలితాల్లో కనీసం పది నుంచి పదిహేను మంది ఉస్మానియా విద్యార్థులు సివిల్స్ సాధించి ఈ వేదిక ద్వారా మాట్లాడాలని బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం విద్యార్థులకు పిలుపునిచ్చారు. సివిల్స్ 2 వ హబ్ గా హైదరాబాద్ మారుతుందన్నారు. భిన్న నేపథ్యాల నుంచి సివిల్స్ సర్వీసెస్ సాధించి చూపిన అభ్యర్థుల జీవితాలు విద్యార్థులు ప్రేరణగా తీసుకోవాలని ఆయన సూచించారు. 2021లో సివిల్స్ ర్యాంకులు సాధించిన 20 మంది అభ్యర్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ నేపథ్యాన్ని, సివిల్స్ సాధించే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు.

ప్రణాళిక, వ్యూహం ఉంటే సివిల్స్ సాధించవచ్చని తనకు 25 సంవత్సరాలు నిండే వరకు సివిల్స్ సాధించాలనే లక్ష్యాన్ని పెట్టుకుని సాధించినట్లు శరత్ నాయక్ అన్నారు. తొమ్మిదో తరగతిలోనే తాను ఐఏఎస్ అవ్వాలని నిర్ణేశించుకున్నట్లు తెలిపారు. తీవ్ర వైకల్యంతో బాధపడుతూ నడవలేని, రాయలేని స్థితిలో స్మరణ్ రాజ్ సివిల్స్ సాధించాడు. బ్రెయిన్ హెమరేజ్ వచ్చి ఒకవైపు శరీరం చచ్చుబడిపోయినా పట్టుదలతో సివిల్స్ సాధించానని గద్గద స్వరంతో స్మరణ్ రాజ్ వివరించారు. అమ్మ, అమ్మ భాష, పట్టిన నేల అనే సూత్రాన్ని తాను ఎప్పుడూ పాటిస్తానని అన్నారు. మత్స్యకార కుటుంబంలో పుట్టి అనేక ఆటుపోట్ల మధ్య తాను సివిల్స్ సాధించానని అశోక్ వెల్లడించారు.

సివిల్స్ సాధించేందుకు ఎలాంటి నోట్స్ రాసుకోవాలో వివరించారు. కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే సివిల్స్ లో 56వ ర్యాంకు సాధించానని కిరణ్మయి చెప్పుకొచ్చారు. ఎలాంటి కోచింగ్ లేకుండానే సొంతంగా చదవి ర్యాంకు సాధించానని అమిత, రంజీత్ వెల్లడించారు.ఉస్మానియా విశ్వవిద్యాలయం వేదికగా మాట్లాడే అవకాశం రావటం సంతోషంగా ఉందని అన్నారు. ప్రిపరేషన్, ప్రాక్టీస్, ప్రెజెంటేషన్ ద్వారా సివిల్స్ సాధించానని జనీత్ చంద్ర అన్నారు. ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే కుటుంబ నేపథ్యాలు అవసరం లేదని ఓయూ యూజీసీ డీన్ ప్రొఫెసర్ జి. మల్లేశం అన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు యూనివర్శిటీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

# జూలై 3న భీమవరానికి ప్రధాని మోదీ: విష్ణువర్ధన్ రెడ్డి

విజయవాడ, జులై 2ప్రధాని మోదీ జూలై 3వ తేదీ భీమవరంలో పర్యటించనున్నారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. పర్యటన పూర్తి వివరాలను ఆయన వివరించారు. " ప్రధాని మోదీ బేగంపేట ఎయిర్ పోర్టు నుంచి ఉదయం 10.10గంటలకు గన్నవరం విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో భీమవరానికి 11 గంటలకు చేరుకుంటారు. అక్కడ అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించాక బహిరంగ సభలో పాల్గొంటారు. బహిరంగ సభకు భారీగా బీజేపీ శ్రేణులు హాజరుకావాలని పిలుపునిచ్చాం. రాజకీయాలకు అతీతంగా ఈ సభ నిర్వహిస్తున్నారు. కవులు, కళాకారులు, గాయనీ గాయకులతో పాటు ప్రతిపక్ష పార్టీలకు ఆహ్వానాలు పంపాం." అని పేర్కొన్నారు.

విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని రాజకీయ కోణంలో చూడొద్దు"అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని బీజేపీ నిర్వహించడం లేదు. భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ నిర్వహిస్తుంది. రాజకీయ కోణంలో విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని చూడొద్దు. తెలంగాణాకు ప్రధాని మోదీ వస్తే కేసీఆర్ వెళ్లి అహ్వానించకపోవడం దొరతనానికి నిదర్శనం. గతంలో ఇదే పోకడపోయిన వారి పరిస్థితి ఏమైందో ఆయన తెలుసుకోవాలి. రాష్ట్రాభివ?ద్ధిపై కేసీఆర్‌కు ప్రేమ ఉంటే ప్రధాని వద్దకు వెళ్లి రాష్ట్రానికి కావాల్సిన వాటిపై అడిగేవారు. మిగతా రాష్ట్రాల ముఖ్యమంత్రులు అడగడం లేదా?" అని అన్నారు విష్ణువర్ధన్ రెడ్డి. బస్ చార్జీలు పెంచడం సిగ్గుచేటు." "ఏపీలో పెట్రోల్, డీజిల్ తగ్గించకుండా బస్ చార్జీలు పెంచడం సిగ్గుచేటు. ప్రభుత్వ ఉద్యోగుల నిధి ఎక్కడుందో తెలియని పరిస్థితి. అన్ని అంశాలు సజ్జల మాట్లాడితే ఏపీ మంత్రులు డమ్మీనా? మంత్రి వర్గాన్ని భర్తరఫ్ చేసి అన్ని శాఖలు సజ్జలకు ఆయనకే ఇవ్వొచ్చు కదా. దేశమంతా అంబేద్కర్ రాజ్యాంగం అమలవుతుంటే.. ఏపీలో మాత్రం జగన్ రాజ్యాంగం అమలవుతోంది. వైసీపీ అసమర్ధ పాలన వల్ల రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయింది." అని విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు.

# టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ పులి రాంబాబు గౌడ్ఆధ్వర్యంలో కరాటే మాస్టర్ మన్నాన్ కు సత్కారం

## -మన్నాన్ కు ఇంటర్నేషనల్ అవార్డు రావడం పట్ల హర్షం






రాజన్న సిరిసిల్ల, జులై 2 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ ఓకినావా మార్షల్ ఆర్ట్ అకాడమి ఫౌండర్, సీనియర్ జర్నలిస్టు ఎంఏ మన్నాన్ కు బ్రూస్ లీ ఆల్ మార్షల్ ఆర్ట్స్-2022 ఇంటర్నేషనల్ అవార్డు రావడం పట్ల వేములవాడ టిడిపి నాయకులు ఈ సందర్భంగా శనివారం టిడిపి నియోజకవర్గం ఇన్చార్జ్ పులి రాంబాబు గౌడ్ ఆధ్వర్యంలో కరాటే మాస్టర్, సీనియర్ జర్నలిస్ట్ మన్నాన్ ను శాలువాతో సన్మానించారు. అనంతరం టీడీపీ నియోజకవర్గం ఇన్చార్జ్ పులి రాంబాబు గౌడ్ మాట్లాడుతూ మన్నాన్ కుఅంతర్జాతీయ గుర్తింపు పొందిన గ్లోబల్ వరల్డ్ రికార్డ్ సంస్థ గుర్తింపు రావడం హర్షణీయమని అన్నారు. మన్నాన్ 35 ఏళ్ళ పాటు వేలాదిమంది ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇచ్చి జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో బ్లాక్ బెల్ట్స్, బంగారు పతకాలు సాధించేలా ఎనలేని కృషి చేశారని కొనియాడారు.

మన్నాన్ శిక్షణలో ఇలాంటి పురస్కారాలు మరెన్నో వరించాలని వారు కోరుకున్నారు. అలాగే వేములవాడ పట్టణ ముస్లిం కమిటీ ప్రధాన కార్యదర్శి ఎం.డీ వ లీ మోహమ్మద్ అబ్దుల్ మన్నాన్ నుసన్మానించారు అనంతరం తనను సన్మానించిన టిడిపి నాయకులకు, పట్టణ ముస్లిం కమిటీ ప్రధానకార్యదర్శి వలీ మొహమ్మద్ కు మన్నాన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత కార్య దర్శి నందిపేట రమణాయాదవ్ ,టీడీపీ పట్టణాధ్యక్షుడు ముప్పిడి శ్రీధర్ ,గౌడ సంఘం నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు .

# తెలంగాణ సంస్కృతికి ప్రతీక-బోనాల ఉత్సవాలు

హైదరాబాద్, జులై 2: బోనాల ఉత్సవాలు తెలంగాణ ప్రజల ఆచార వ్యవహారాలకు, సాంస్కృతిక సంబరాలకు ప్రతీకగా నిలుస్తున్నాయి.తెలంగాణ ప్రాంతంలో జరిగే ఉత్సవాలు, పండుగలు, వేడుకలు ఎంతో ప్రసిద్ధి పొందాయి. ముఖ్యమంత్రి కేసీఆర్, తెలంగాణ ప్రాంతానికి ప్రతీకగా నిలిచిన బోనాల ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రభుత్వమే నిర్వహిస్తోంది.తెలంగాణలో బోనాల ఉత్సవాలు ఆరంభం అయ్యాయంటే విదేశీ, దేశీ యాత్రికులకు సందడే సందడి. ముఖ్యంగా రాజధాని హైదరాబాద్ నగరంలో జరిగే బోనాల ఉత్సవాలు దేశ ప్రజలందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ మేరకు ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. జూన్ 30న గోల్కొండ జగదాంబికా ఆలయంలో బోనాలను ప్రభుత్వం ఘనంగా ప్రారంభించింది.ఉత్సవాలకు సంబంధించి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇటీవల ఒక ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి బోనాలు ఉత్సవాల నిర్వహణపై అధికారులకు దిశా నిర్దేశనం చేశారు.

బోనాలు, బతుకమ్మ ఉత్సవాలు ఇప్పుడు విశ్వవ్యాప్తం అయ్యాయి. బోనాల ఉత్సవాల సందర్భంగా వచ్చే లక్షలాది మంది భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా వివిధ శాఖల ఆధ్వర్యంలో అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. జులై 17 న సికింద్రాబాద్, 24 న హైదరాబాద్ బోనాలు జరుగుతాయి. బోనాల ఉత్సవాల సందర్భంగా గోల్కొండలోని జగదాంబ మహంకాళి అమ్మవారితో పాటు 26 దేవాలయాలకు ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలను సమర్పించడం జరుగుతుందని అధికారులు అన్నారు. బోనాల సందర్భంగా అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చే భక్తులు తోపులాటకు గురికాకుండా పటిష్టమైన భారీకేడ్ లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

అదేవిధంగా శాంతిభద్రతల పర్యవేక్షణ కోసం గోల్కొండ వద్ద అఅ కెమెరాలను ఏర్పాటు చేశారు. 800 మంది సిబ్బందితో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అదేవిధంగా మఫ్టీ పోలీసులు, షీ టీమ్ లను కూడా నియమిస్తున్నామని పోలీస్ ఉన్నతాధికారులు తెలిపారు. వాహనాల పార్కింగ్ కోసం 8 ప్రాంతాలను గుర్తించడం జరిగిందని, 14 ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లించనున్నట్లు చెప్పారు.భక్తుల దాహార్తి తీర్చేందుకు వాటర్ వర్క్స్ ఆధ్వర్యంలో 8.75 లక్షల వాటర్ ప్యాకెట్స్, 55 వేల వాటర్ బాటిల్స్ ను అందుబాటులో ఉంచడం జరుగుతుందని వివరించారు. అదేవిధంగా 4 అంబులెన్స్ లు అందుబాటులో ఉంటాయని, 5 మెడికల్ క్యాంప్ లను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

రోడ్ల మరమ్మతులు ఉంటే గుర్తించి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ప్రత్యేకంగా ఖీఅ బస్సులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.తెలంగాణ అంటేనే పండుగలకు, పబ్బాలకు, బోనాల ఉత్సవాలు, వినాయక చతుర్థి ఉత్సవాలు, బతుకమ్మ పండుగ సంబరాలు,దసరా సంబరాలు, దీపావళి నవరాత్రి వేడుకలు తెలుగు ప్రజలకు గుర్తుకు వస్తాయి. గతంలో ఈ ఉత్సవాలు నామమాత్రంగానే జరిగేవి. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక దృష్టితో, తెలంగాణ కీర్తి ప్రతిష్టలు , తెలంగాణ ఆత్మ గౌరవం ప్రపంచానికి తెలియాలని ఒక సత్ సంకల్పంతో , బోనాలు, ఇతర వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# ప్రగతిలో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**-జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**
**-సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ అధికారులతో కలెక్టర్ సమీక్ష**

రాజన్న సిరిసిల్ల, జులై 2 (నేటినిజం ప్రతినిధి): సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల పరిధిలో ప్రగతిలో ఉన్న అభివృద్ధి పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు.

శనివారం ఆయన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల పరిధిలో రోడ్లు, ఫుట్ పాత్ లను ఆనుకుని ఉన్న ప్రమాదకరంగా ఉన్న మ్యాన్ హోల్స్ ను గుర్తించి, ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు.

వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పారిశుద్ధ్యం సక్రమంగా ఉంటేనే సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చని సూచించారు. రెండు మున్సిపాలిటీల్లోని అన్ని వార్డుల్లో ప్రతీ మంగళవారం, శుక్రవారం, ఆదివారం డ్రైడే నిర్వహించాలని అన్నారు. మురుగు నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్ వేయించాలని, సరిపడా ఫాగింగ్ మెషీన్లను కొనుగోలు చేసి, అన్ని వార్డుల్లో స్ప్రే చేయించాలని అన్నారు. డ్రైడే కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఇంటింటికీ తిరుగుతూ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. డ్రైడే కార్యక్రమం బాధ్యత తప్పనిసరిగా వార్డు అధికారులదే అని, మున్సిపల్ కమిషనర్లు ప్రతీ శుక్రవారం క్షేత్ర స్థాయిలో డ్రైడే కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. డ్రైడే కార్యక్రమ నిర్వహణపై నివేదికను ప్రతీ మంగళవారం, శుక్రవారం సాయంత్రం తనకు పంపించాలని కలెక్టర్ ఆదేశించారు.

### అభివృద్ధి పనుల్లో



### వేగం పెంచాలి

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో 60 కోట్లకు పైగా రూపాయలతో నిర్మిస్తున్న సీవేజ్ ట్రీట్ మెంట్ ప్లాంట్ (ఎస్టీపి) పనుల పురోగతిపై కలెక్టర్ ఆరా తీశారు. పనులు వేగవంతం చేసేలా అధికారులు దృష్టి సారించాలని అన్నారు. 13 లక్షల రూపాయలతో రాజీవ్ నగర్ లో నిర్మిస్తున్న బస్తీ దవాఖాన నిర్మాణ పనులు పూర్తి చేసి రాబోయే 15 రోజుల్లోగా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

వెంకటాపూర్ అర్బన్ ఫారెస్ట్ పార్క్ లో మున్సిపాలిటీకి కేటాయించిన సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని అన్నారు. వేములవాడ పట్టణంలో 4 కోట్ల 50 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న సమీకృత వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్, భగవంతరావునగర్ లో 2 కోట్ల 70 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న వెజ్ మార్కెట్, తెట్టెకుంటలో 1 కోటి 30 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న డంపింగ్ యార్డు నిర్మాణ పనుల పురోగతిపై కలెక్టర్ ఆరా తీశారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు.

### రెండు పడక గదుల కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని శాంతి నగర్, రగుడు, పెద్దూర్ లో నిర్మిస్తున్న రెండు పడక గదుల కాలనీల్లో నీటి సరఫరా లైన్, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, సెప్టిక్ ట్యాంకుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ అన్నారు.

### మల్టీ లేయర్ ఎవెన్యూ ప్లాంటేషన్

పట్టణాల్లోని రోడ్లకు ఇరువైపులా మల్టీ లేయర్ ఎవెన్యూ ప్లాంటేషన్ లో భాగంగా మొక్కలు నాటి సంరక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. వెంకటాపూర్ నుండి రగుడు వరకు నిర్మిస్తున్న రహదారి వెంబడి మొక్కలు నాటేందుకు మెషీన్ల సహాయంతో గుంతలు తీయించడానికి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ కు సూచించారు.

### టీఎస్ బీపాస్

భవన నిర్మాణ అనుమతుల కోసం టీఎస్ బీపాస్ పోర్టల్ ద్వారా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకున్న వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి పెండింగ్ లో ఉంచకుండా నిర్మాణ అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. వేములవాడలో బఫర్ జోన్ లో ఉన్న భవనాలకు నోటీస్ లు జారీ చేయాలని, ఫర్ జోన్ లో కొత్తగా నిర్మాణాలు జరగకుండా బాధ్యత టౌన్ ప్లానింగ్ అధికారులదే అని ఆయన స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు సమ్మయ్య, శ్యామ్ సుందర్ రావు, డీటీసీపీఓ అన్సార్, పబ్లిక్ హెల్త్ డీఈ ప్రసాద్, సంబంధిత ఇంజనీర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ నాయకుల ముందస్తు అరెస్టులు హేయమైన చర్య-గుండా థామస్




రాజన్న సిరిసిల్ల, జులై 2 (నేటినిజం ప్రతినిధి): ఎమ్మార్పీఎస్ నాయకుల ముందస్తు అరెస్టులు కేంద్ర ప్రభుత్వ హేయమైన చర్య అనిసీనియర్ నాయకుడు గుండా థామస్ అభివర్ణించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా జులై 2న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని అన్ని జిల్లాలలో సడక్ బంద్ కార్యక్రమం, 3వ తేదీన హైదరాబాదులో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆఫీస్ నుండి ఇంద్ర పార్క్ వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టనున్న ఎమ్మార్పీఎస్ నాయకులను అక్రమంగా, అన్యాయంగా పోలీస్ యంత్రాంగం ముందస్తు అరెస్ట్ చేసి నిర్బంధించడం ఇది హేయమైన చర్యగా భావిస్తున్నామన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత 100 రోజుల్లో ఏ బి సి డి వర్గీకరణ చేస్తామని ఆనాడు మాటిచ్చి ఎనిమిది సంవత్సరాలు గడిచినా వర్గీకరణ మీద ఒక్క మాట మాట్లాడకపోవడం యావత్తు మాదిగ ఉపకులాలను అవమానపరిచినట్టుగానే భావిస్తున్నామన్నారు.

ఎన్ని అరెస్టులు చేసినా, ఎంతమందిని జైలులో పెట్టిన హైదరాబాదులో నరేంద్ర మోడీ జరిగే సభ కచ్చితంగా అడ్డుకుంటామని హెచ్చరించారు. కాగా వేములవాడ రూరల్ పరిధిలోనిఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు అవును ప్రభాకర్, తాండ్ర తిరుపతి, నేదూరి నరసయ్య, కోమ్ము శంకర్ లను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లో నిర్బంధించారు.

# డిసెంబర్ 1 నుండి 3 వరకు ముంబైలో ఎలివేటర్ ఇండస్ట్రీ ఎక్స్పో

హైదరాబాద్, జులై 2: భారతదేశం ప్రపంచంలో రెండవ అతిపెద్ద ఎలివేటర్ మార్కెట్. ఎలివేటర్ ఉ ఎస్కలేటర్ కాంపోనెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రకారం, ప్రపంచ ఎలివేటర్ మార్కెట్లో భారతదేశం 7% కంటే ఎక్కువ వాటా కలిగి ఉండగా, ఇది ప్రపంచ ఎలివేటర్ ఎగుమతులకు 0.25% కంటే తక్కువ దోహదం చేస్తుంది. మద్రాస్ కన్సల్టెన్సీ గ్రూప్ ప్రకారం, భారతదేశం 300 మిలియన్ విలువైన ఎలివేటర్ భాగాలను దిగుమతి చేస్తుంది. 65%తో చైనా ప్రాథమిక లబ్ధిదారు.ఎగుమతులు మరియు దిగుమతులకు సంబంధించిన క్రమరాహిత్యాన్ని సరిదిద్దే లక్ష్యంతో ఎలివేటర్లు మరియు ఎస్కలేటర్ల కోసం అంతర్జాతీయ సోర్సింగ్ ఎక్స్పోజిషన్ ప్రారంభించబడింది. ఎలివేటర్లు మరియు ఎస్కలేటర్ల కోసం భారతదేశాన్ని గ్లోబల్ సోర్సింగ్ హబ్గా ఉంచడం మరియు పరిశ్రమ చైనాపై ఆధారపడటాన్ని తగ్గించడం యొక్క ప్రాథమిక లక్ష్యం. ఎలివేటర్లు, ఎస్కలేటర్ల కోసం ఇంటర్నేషనల్ సోర్సింగ్ ఎక్స్పోజిషన్ 1, 2, 3 డిసెంబర్, 2022న నిర్వహించబడుతుంది. వేదిక బొంబాయి ఎగ్జిబిషన్ సెంటర్, , గోరేగావ్ (తూర్పు), ముంబై, భారతదేశంలో. ఎలివేటర్ పరిశ్రమ కలుస్తుంది మరియు గొప్ప నెట్వర్కింగ్ ప్లాట్ఫారమ్గా ఉంటుందని హామీ ఇచ్చింది. సినర్జిస్టిక్గా కాంపోనెంట్ తయారీదారులను ఒకచోట చేర్చే ఏకైక ఖచ్చితమైన వివరణ ఇది.

# బాలీవుడ్ నటుడు రాజ్పాల్ యాదవ్కు పోలీసుల నోటీసులు

ముంబై, జులై 2: బాలీవుడ్ స్టార్ కమెడియన్ రాజ్పాల్ యాదవ్కు పోలీసులు నోటీసులు జారీచేశారు. రూ.20లక్షలు మోసం చేశారనే ఫిర్యాదు మేరకు ఇండర్ పోలీసులు నోటీసులు జారీ చేసి, 15 రోజుల్లో పోలీసుల ఎదుట హాజరుకావాలని ఆదేశించారు.

రాజ్పాల్ యాదవ్ తన కుమారుడిని సినీ పరిశ్రమలో ప్రోత్సాహం అందిస్తానని రూ.20 లక్షలు తీసుకున్నాడని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అయితే, ఇప్పటి వరకు నటుడు తన కుమారుడికి ఎలాంటి సహకారం అందించలేదని, అదే సమయంలో డబ్బులు సైతం తిరిగి ఇవ్వలేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఫోన్ చేసినా స్పందించడం లేదని, డబ్బులు ఇవ్వడం లేదంటూ బాధితుడు తుకోగంజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. 15 రోజుల్లో తమ ఎదుట హాజరుకావాలంటూ నోటీసులు జారీచేశారు. గతవారం సురిందర్ సింగ్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు కేసు విచారణ జరుపుతున్నట్లు సబ్ ఇన్స్పెక్టర్ లాలన్ మిశ్రా తెలిపారు.

# ఫ్లైఓవర్ గోడను ఢీకొట్టిన బైక్.. ఇద్దరు విద్యార్థులు మృతి

అమరావతి, జులై 2: ఓ రోడ్డుప్రమాదంలో ఇద్దరు మృతిచెందిన విషాద ఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లాలో చోటుచేసుకుంది. ఓ బైక్ అతివేగంతో ఫ్లైఓవర్ గోడను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే మృతిచెందారు. మృతులు ఇంజినీరింగ్ విద్యార్థులు మస్తాన్, చైతన్యగా గుర్తించారు.

# అర్బన్ తహసీల్దార్ రాజారెడ్డికి పలువురి శుభాకాంక్షలు



రాజన్న సిరిసిల్ల, జులై 2 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ తహసీల్దార్ గా సోలిపురం రాజారెడ్డి పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనను పలువురు ప్రజాప్రతినిధులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రాజారెడ్డికి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో

అర్బన్ టీఆరెఎస్ నాయకులు జడ్పీటీసి మ్యాకల రవి, ఎంపీపీ బూర వజ్రమ్మ బాబు, టీఆరెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఊరడి ప్రవీణ్, వైస్ ఎంపీపీ ఆర్సీ రావు, సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షులు ఊరడి రాంరెడ్డి, సర్పంచ్ లు వెంకటరమణ రావు, స్వయంప్రభ, రాణి హరిచరణ్ రావు, నవీన రాజు, రంగు సత్తమ్మ రాములు, రాసురి రాజేశం, ఎంపీటీసీ ల ఫోరమ్ అధ్యక్షులు దేవరాజు, ఎంపీడీఓ శ్రీధర్ ఉన్నారు.






# ఒకేలా ఆడను.. అందుకే బౌలర్స్ డిస్టర్బ్ అయిపోతారు: పంత్



హైదరాబాద్, జులై 2:ఇంగ్లండ్తో జరుగుతున్న టెస్టు మ్యాచ్లో అద్భుతంగా బ్యాటింగ్ చేసి అందరి మన్ననలు పొందిన వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్. కేవలం 111 బంతుల్లోనే 146 పరుగులు చేసి వన్డే, టీ20 తరహా ఆటతీరుతో అందరినీ అలరించాడీ ఎడం చేతి వాటం బ్యాటర్. దీనిపై మాట్లాడుతూ.. "నేను ఒకే విధంగా ఆడకూడదని ట్రై చేస్తూ ఉంటా. దాంతో బౌలర్లు మెంటల్గా డిస్టర్బ్ అయిపోతారు" అని చెప్పాడు.

అలాగే ఇంగ్లండ్ వంటి పిచ్లపై, అది కూడా బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నప్పుడు అలా వారిని డిస్టర్బ్ చేయడం చాలా ముఖ్యమన్నాడు. దాంతో సదరు బౌలర్ లైన్ అండ్ లెంగ్త్ కూడా దెబ్బతింటుందని వివరించాడు. తొలి రోజు ఆటలో అద్భుతంగా బ్యాటింగ్ చేసిన పంత్.. భారత్ తరఫున అత్యంత వేగంగా టెస్టు సెంచరీ చేసిన కీపర్ బ్యాటర్గా రికార్డు నెలకొల్పాడు. ఈ క్రమంలోనే ధోనీ పేరిట ఉన్న రికార్డును బద్దలు కొట్టిన సంగతి తెలిసిందే.

# రెండో వికెట్ కోల్పోయిన ఇంగ్లండ్.. మళ్లీ బుమ్రానే

హైదరాబాద్, జులై 2:తొలిసారి జట్టు పగ్గాలు అందుకున్న కెప్టెన్ బుమ్రా తన అద్భుతమైన ఆటతీరుతో ఆకట్టుకుంటున్నాడు. అంతకుముందు బ్యాటుతో (16 బంతుల్లో 31 నాటౌట్) ప్రపంచ రికార్డు సృష్టించిన తర్వాత బంతితో కూడా విజృంభిస్తున్నాడు. తర్వాత అలెక్స్ లీస్ను క్లీన్ బౌల్డ్ చేశాడు. లంచ్ తర్వాత బంతి అందుకున్న తొలి ఓవర్లోనే మరో వికెట్ తీశాడు.

మరో ఓపెనర్ జాక్ క్రాలీ (9)ని అవుట్ చేశాడు. బుమ్రా వేసిన బంతిని డ్రైవ్ చేయడానికి క్రాలీ ప్రయత్నించాడు. కానీ అతను విఫలమవడంతో ఎడ్జ్ తీసుకున్న బంతి థర్డ్ స్లిప్స్లో ఉన్న గిల్ వైపు వెళ్లింది. అతను ఎలాంటి పొరపాటు చెయ్యలేదు. దాంతో 27 పరుగుల వద్ద ఇంగ్లండ్ జట్టు రెండో వికెట్ కోల్పోయింది. మాజీ సారథి జో రూట్ క్రీజులోకి వచ్చాడు.

# వింబుల్డన్ రెండో రౌండ్లో సానియా జోడీ



హైదరాబాద్, జులై 2:భారత స్టార్ టెన్నిస్ ప్లేయర్ సానియా మిర్జా.. తన జోడీ మేట్ పావిక్తో కలిసి వింబుల్డన్ రెండో రౌండ్లో అడుగు పెట్టింది. ఇదే తన ఆఖరి వింబుల్డన్ టోర్నమెంట్ అని ఇప్పటికే ప్రకటించిన సానియా.. శుక్రవారం జరిగిన మిక్సిడ్ డబుల్స్ మ్యాచ్లో 6-4, 3-6, 7-6 (10-3) తేడాతో విజయం సాధించింది.

ఆరో సీడ్గా బరిలో దిగిన సానియా-మేట్ పావిక్ జోడీ.. అన్సీడెడ్ జోడీ అయిన డేవిడ్ వేగా హెర్నాండెజ్-నటాలీ జాలమిజే జోడీని ఓడించి రెండో రౌండ్లో అడుగు పెట్టింది. ఈ అంతర్జాతీయ సీజన్ తనకు చివరిదని సానియా కొన్నిరోజుల క్రితం ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో ఆమె చివరి వింబుల్డన్ ప్రదర్శన ఎలా ఉండనుందా? అని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# కారు, ఆటో ఢీ.. 12మందికి తీవ్రగాయాలు

నెల్లూర, జులై 2 జిల్లాలో కారు, ఆటో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో 12మందికి తీవ్రగాయాలయ్యాయి. జిల్లాలోని కోవూరు పల్లి వద్ద ఎన్ హెచ్ పై ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. గాయపడిన వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. గాయాలపాలైన వారిని ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమయంలో ఆటోలో 17మంది మహిళలున్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.